PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 42 సంచిక : 256 | విజయవాడ, బుధవారం 19 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 19 April 2023 | Rs

పుల్వామా వైఫల్యానికి ప్రభుత్వానిదే బాధ్యత

- అది నివారించదగినదే
- జవాన్లను విమానంలో పంపాల్సింది
- పుల్వామా ఘటనపై మాజీ ఆర్మీ చీఫ్ శంకర్ రాయ్

• లోపలి పేజీలో..•



ప్రపంచ రికార్డు సమం చేసిన జ్యోతి సురేఖ

- ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1

• లోపలి పేజీలో..•



టిడిపి జోన్-5 సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

వై నాట్ పులివెందుల..

- టిడిపి జోన్-5 సమీక్షా సమావేశంలో చంద్రబాబు
- కడప దర్గాలో ప్రార్థనలు, అనంతరం ఇఫ్తార్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

శాసనమండలి ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం వైసిపిలో భూకంపం పుట్టించిందని, వీటి పరిధిలోని 108 నియోజకవర్గాల్లో ముందున్నామని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. కడపలోని పుత్తా ఎస్టేట్‌లో మంగళవారం జరిగిన టిడిపి జోన్-5 సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 175 నియోజకవర్గాల్లో వైసిపి గెలుపు వైనాట్ అన్నారని, గత ఎన్నికల్లో బి.టెక్ రవి, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రామ్‌గోపాల్ రెడ్డి, రాబోయే ఎన్నికల్లో పులివెందుల్లో గెలుపు వైనాట్ అని తాను అంటున్నానని పేర్కొన్నారు. దేశంలో పెట్రో ధరల పెరుగుదలకు రాష్ట్రమే చిరునామాగా మారిందని విమర్శించారు. ఇసుక, సిమెంట్, స్టీల్ ధరలు పెరగడంతో రాష్ట్రంలోని 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం మద్యంతో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 'ముఖ్యమంత్రి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డిని హత్య చేసి గుండెపోటని, రక్తపు వాంతులని చెప్పారు. చివరికి నాపైనా నిందలు వేసిన నీచసంస్కృతి పులివెందుల నుంచే ప్రారంభమైంది' అని దుయ్యబట్టారు. ప్రత్యర్థి పార్టీ సభ్యులే తమ చిన్నాన్నను చంపేశారని 2019 ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ప్రచారం చేశారని, కోడికత్తి కేసులోనూ సానుభూతి పొందారని తెలిపారు. చివరికి అధికారంలోకి వచ్చిన తర్వాత కోర్టుల నుంచి కేసును ఉపసంహరించుకునే పరిస్థితికి వచ్చారని విమర్శించారు. వైఎస్ వివేకా కేసు ప్రపంచ పోలీసులు, న్యాయ వ్యవస్థ, విద్యార్థులకు కేస్ స్టడీగా మారిందని ఎద్దేవా చేశారు. కడప స్టీల్‌ప్లాంట్‌కు మూడు శంకుస్థాపనలు చేయడమేమిటని ప్రశ్నించారు. కర్ణాటకలో అప్పర్‌భద్ర కడితే శ్రీశైలానికి నీళ్లు రావని ఆందోళన వ్యక్తం చేశారు. రంజాన్ తోఫా, పండుగ కానుకలు, విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ వంటి సంక్షేమ పథకాలను జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. టిడిపి కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నరసింహులు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన భార్యకు రూ.9 లక్షల చెక్కును చంద్రబాబు అందజేశారు. పెద్ద దర్గాలో ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు, ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, బిటి.నాయుడు, మాజీ మంత్రులు అమర్‌నాథ్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కడప, నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం జిల్లాల టిడిపి అధ్యక్షులు, 35 నియోజక వర్గాల టిడిపి ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదేం పద్ధతి?

నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకోరా?

బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

గుజరాత్ ప్రభుత్వానికి, కేంద్రానికి నోటీసులు



న్యూఢిల్లీ : బిల్కిస్ బానో కేసులో దోషులను శిక్ష ముగియకుండానే విడుదల చేయడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకోకుండా ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. దోషులను విడుదల చేయడానికి దారితీసిన కారణాలేమిటో వివరించాలని జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం నాడు ఆదేశాలు జారీ చేసింది. గోద్రా అనంతరం గుజరాత్‌లో సాగిన మారణకాండలో బిల్కిస్ బానో కుటుంబ సభ్యులను హత్య చేసి, గర్భవతి అయిన ఆమె పైనా అత్యాచారం చేసి అత్యంత ఘోర నేరాలకు పాల్పడిన దుండగులను గుజరాత్ ఎన్నికల వేళ విడుదల చేసిన సంగతి విదితమే. యావజ్జీవ శిక్ష పడిన 11 మంది ఖైదీలను శిక్ష ముగియక ముందే విడుదల చేయడం, సంఫ్ పరివార్ వారికి పూలమాలలు వేసి స్వాగతం పలకడం, మిఠాయిలు పంచడం పెను దుమారం రేపడమే గాక, దేశవ్యాప్తంగానూ ఈ చర్యను ఖండిస్తూ నిరసనలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వారి విడుదలపై బిల్కిస్ బానో సుప్రీంకోర్టును ఆశ్రయించగా దానిపై ఇప్పుడు విచారణ సాగుతోంది. ఇటువంటి హేయమైన తీవ్ర నేరాల్లో ఇలా శిక్ష కుదింపు, మినహాయింపులను అనుమతిస్తే, సమాజంపై ఇది తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది.

బిల్కిస్ కేసులో కేంద్ర, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది మార్చి 27న సుప్రీంకోర్టు 'ఇదొక భయంకరమైన ఘటన' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దోషులను రెమిషన్ మీద ఎందుకు విడుదల చేశారో వివరణ ఇవ్వాలని, అందుకు సంబంధించిన ఫైళ్లను తమకు సమర్పించాలని కేంద్ర, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలను ఇదివరకే ఆదేశించింది. అయితే ..11 మంది దోషులకు శిక్ష ఉపశమనానికి సంబంధించిన ఫైళ్లను సుప్రీంకోర్టుకు సమర్పించరాదని గుజరాత్ ప్రభుత్వం భావిస్తోంది. ఇదే విషయాన్ని ధర్మాసనానికి తెలిపింది. ఒక సాధారణ హత్య కేసులో ఎలాగైతే దోషులకు రెమిషన్ కింద ముందస్తు విడుదల చేస్తామో..అలాగే ఈ కేసులోనూ చేశామంటూ తేన చర్యను గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకుంది. గుజరాత్ ప్రభుత్వ ఈ నిరంకుశ తీరుపైనే సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం నాడు మరోమారు ఆగ్రహం వ్యక్తం చేయాల్సివచ్చింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని అధికారంలో వున్న వారు వ్యవహరించాలని గుర్తు చేసింది. తీవ్రమైన నేరాలను సాధారణ నేరాలుగా చూస్తారా అంటూ నిలదీసింది. దోషులను ముందస్తుగా ఎందుకు రిలీజ్ చేయాల్సివచ్చిందో చెప్పాలంటూ మరోమారు వివరణ కోరింది. 'ఇవాళ బిల్కిస్ బానో. రేపు మరొకరు. దేశంలోని నా సోదర సోదరీమణులకు ఏమి జరుగుతుందో అనే కచ్చితమైన ఆందోళన కలుగుతోంది' అని జస్టిస్ జోసెఫ్ అన్నారు. అయితే గుజరాత్; కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు మాట్లాడుతూ..సుప్రీంకోర్టు ఆదేశాలపై రివ్యూ పిటిషన్‌కు ఆలోచన చేస్తున్నామని, ఈ విషయంలో ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కోర్టుకు తెలిపారు.

ఈ క్రమంలో జోక్యం చేసుకున్న ధర్మాసనం 'బిల్కిస్ బానో కేసు ఘోరమైన నేరం. రెమిషన్ ప్రకటించే ముందు మరోవైపు కూడా ఆలోచించాల్సివుండాల్సింది. ఇది సరైన పద్ధతి కాదు' అని పేర్కొంది. తీవ్రమైన నేరాల్లో వ్యవహరించే పద్ధతి ఇది కాదని గుజరాత్ ప్రభుత్వ తీరును కడిగిపారేసింది. రెమిషన్‌కు సంబంధించిన ఫైళ్లను గనుక కోర్టుకు సమర్పించకపోతే ..అది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని స్పష్టం చేసింది. ప్రభుత్వాలు అంత పక్కాగా చేసినప్పుడు.. భయపడాల్సిన అవసరమేమిటని ధర్మాసనం ప్రశ్నించింది.

'ఒక గర్భవతిని (బిల్కిస్ బానో) గ్యాంగ్ రేప్ చేశారు. అలాంటప్పుడు ఈ కేసును సాధారణమైన హత్య కేసుగా పోల్చడానికి వీల్లేదు. యాపిల్స్‌ను బత్తాయిలతో పోల్చలేం. అలాగే ఇంతటి మారణకాండను సింగిల్ మర్డర్‌గా పోల్చడానికి వీల్లేదు. నేరాలు అనేవి సాధారణంగా సమాజానికి, కమ్యూనిటికీ వ్యతిరేకంగా జరుగుతుంటాయి. అసమానతలను సమానంగా చూడలేం.' అని కేంద్రానికి, గుజరాత్ ప్రభుత్వానికి కోర్టు తలంటింది. 'ఇవాళ బిల్కిస్..రేపు ఇంకెవరో?. అది మీరైనా కావచ్చు. రెమిషన్ ఇవ్వడానికి గల కారణాలను చూపించకపోతే, ఫైళ్లు సమర్పించకపోతే.. న్యాయవ్యవస్థ తన స్వంత తీర్మానాన్ని తీసుకోవాల్సివుంటుంది' అని స్పష్టం చేసింది. 11 మంది దోషులను శిక్ష పూర్తి కాకుండానే విడుదల చేయడాన్ని బిల్కిస్ బానో సవాలు చేసింది. అలాగే దాఖలైన పలు అభ్యర్థనలను మే 2వ తేదీన సుప్రీంకోర్టు విచారించనుంది. నోటీసులు అందుకోని దోషులందరూ తమ ప్రత్యుత్తరాలను పంపాలని కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సిపిఎం నేత సుభాషిణి అలీ, స్వతంత్ర పాత్రికేయురాలు రేవతి లాల్, లక్నో యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ రూప్ రేఖా వర్మ, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి మహువా మొయిత్రా లు కూడా ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)లు దాఖలు చేసిన విషయం విదితమే. దోషులను గుజరాత్ ప్రభుత్వం గతేడాది ఆగస్టు 15న విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఉన్నావో బాధితురాలి

ఇంటికి నిప్పు

- మృత్యువుతో పోరాడుతున్న పసిపిల్లలు

ఉన్నావో : గతేడాది అత్యాచారానికి గురైన మైనర్ దళిత బాలిక వుంటున్న పూరిపాకకు కొంతమంది దుండగులు సోమవారం నిప్పంటించారు. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరు పసి కందుల పరిస్థితి విషమంగా వుంది. వీరిలో ఒకరు బాధిత మహిళ ఆరు మాసాల మగ బిడ్డ కాగా, మరొకరు రెండు మాసాల వయస్సున్న చెల్లి. 2022 ఫిబ్రవరి 13న 11 ఏళ్ల బాలికపై ఐదుగురు దుండగులు అత్యాచారం చేసిన సంగతి తెలిసిందే. ఆ ఏడాది సెప్టెంబరులో పిల్లాడికి జన్మనిచ్చిందని పోలీసులు తెలిపారు.

ఈ కేసులో రోహన్, సతీష్, అరుణ్, రంజత్, అమన్‌లపై పోస్కో యాక్ట్ కింద మౌర్వాన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అమన్, సతీష్‌లు నెల రోజుల క్రితం బెయిల్‌పై విడుదలయ్యారు. వారు మరో ఐదుగురితో కలిసి సోమవారం సాయంత్రం బాధితురాలి పూరిపాకలోకి బలవంతంగా ప్రవేశించారు. కేసు ఉపసంహరించుకోవడానికి బాధితురాలు తిరస్కరించడంతో బాధితురాలి తల్లిని తీవ్రంగా కొట్టి, అనంతరం పూరిపాకకు నిప్పంటించి పారిపోయారు.

బాధితురాలి కొడుక్కి 35శాతం మేర కాలిందని, సోదరికి 45శాతం మేర కాలిందని చీఫ్ మెడికల్ సూపరింటెడెంట్ సుశీల్ శ్రీవాస్తవ తెలిపారు. వారి పరిస్థితి క్షీణిస్తుండడంతో మరింత మెరుగైన చికిత్స కోసం కాన్పూర్‌కు పంపినట్లు చెప్పారు. నిందితుల పక్షానికి మారిపోయిన బాధితురాలి తండ్రిపై బాధితురాలి తాతా, మేనమామలు గొడ్డలితో దాడి చేశారని పూర్వ సర్కిల్ అధికారి సంతోష్ సింగ్ తెలిపారు. ఈ నెల 13న జరిగిన ఈ ఘటనపై ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. తీవ్ర గాయాలతో జిల్లా ఆస్పత్రిలో ఆమె తండ్రిని చేర్చారని తెలిపారు.

సిఎంతో డిజిపి భేటీ

- అవినాష్‌రెడ్డి విచారణ పర్యవసానాలపై చర్చ?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప ఎంపి అవినాష్‌రెడ్డి సిబిఐ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో ఒక వేళ అరెస్టయితే రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంలో ఎలా ముందు కెళ్లాలన్న అంశంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డితో కీలక సమావేశం నిర్వహించినట్లు సమాచారం. తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు పరిణామాలు, విచారణ జరుగుతున్న తీరుపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే సిఎం తన లండన్ వ్యక్తిగత ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నట్లు సమాచారం. ఈ కేసు నుంచి బయటపడేందుకు కోర్టుల్లో లాబీయింగ్ చేసేందుకు మైసూర్‌కు చెందిన స్వామి విజయ్‌కుమార్‌ను పిలిపించి చర్చించినట్లు తెలుగుదేశం చేస్తున్న ఆరోపణలు కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేసినపుడు కడప జిల్లాల్లో వైసిపి శ్రేణులు ఆందోళనలు, శాంతిర్యాలీలు నిర్వహించిన నేపథ్యంలో అవినాష్‌రెడ్డిని అరెస్ట్ చేస్తే ఎటువంటి చర్యలు చేపట్టాలనే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది.

ఇద్దరు దళిత యువకుల

అనుమానాస్పద మృతి

హత్య చేసి పడేశారంటున్న బంధువులు



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-కాజులూరు (కాకినాడ)

ఇద్దరు దళిత యువకులు అనుమానాస్పద స్థితిలో మరణించిన సంఘటన కాకినాడ జిల్లా కాజులూరులో మంగళవారం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. హత్య చేసి బయో డీజిల్ ట్యాంకులో పడేశారని మృతుల బంధువులు ఆందోళనకు దిగారు. గొల్లపాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్యవటం గ్రామానికి చెందిన తాతపూడి మహేష్ (25), శీల గ్రామానికి చెందిన నేరేడుమిల్లి శివకుమార్(26) లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. సీజ్ చేసిన బయో డీజిల్ ట్యాంకులో వీరిద్దరూ అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండగా, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. యువకులిద్దరినీ హత్య చేసి ట్యాంకులో పడేశారని బంధువులు ఆందోళనకు దిగారు. హత్య కేసుగా నమోదు చేసి యువకులు కుటుంబాలకు న్యాయం చేయాలని మృతుల బంధువులు, పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.



ప్రముఖ చిత్రకారుడు

బాలి కన్నుమూత

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రముఖ రేఖ, వ్యంగ్య చిత్రకారుడు బాలి (78) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. బాలి భార్య, కుమారుడు గతంలోనే మృతి చెందారు. ఆయన కుమార్తె వైశాలి అమెరికాలో స్థిరపడ్డారు. బాలి జన్మస్థలం అనకాపల్లి. 1945 ఆగస్టు 16న జన్మించిన ఆయన అసలు పేరు మేడిశెట్టి శంకరరావు. చిత్రకళపై మక్కువ ఎక్కువ. ఇరిగేషన్ శాఖలో క్లర్క్‌గా పనిచేస్తూనే కార్టూన్లు వేసి పత్రికలకు పంపేవారు. ఈనాడు, ఆంధ్రజ్యోతిల్లో స్టాఫ్ ఆర్టిస్టుగా, కార్టూనిస్టుగా పనిచేశారు. కార్టూన్ చిత్రాలతో ఎనిమిది పుస్తకాలు రాశారు. 35 వరకూ కథలు రాశారు. బాలి పార్థివదేహం వద్ద పలువురు ప్రముఖులు నివాళ్లర్పించారు. ఆయన అంత్యక్రియలు ఎంవిపి కాలనీలోని శ్మశాన వాటికలో జరిగాయి. బాలి మృతి పట్ల సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ సంతాపం వ్యక్తం చేసింది.



ఉక్రెయిన్‌లోని

రష్యన్ సైనిక కేంద్రంలో పుతిన్

కీవ్ : ఉక్రెయిన్‌లో పోరాటం చేస్తున్న తమ సైనికులకు చెందిన ప్రధాన స్థావరాలను రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ మంగళవారం తెల్లవారుజామున సందర్శించారు. ఉక్రెయిన్‌లోని సైనిక స్థావరాలను పుతిన్ సందర్శించడం నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి. ఈ సందర్శనకు సంబంధించిన వీడియోలను రష్యన్ అధ్యక్ష భవనం విడుదల చేసింది. దక్షిణ ఖేర్సాన్‌లోని రష్యా దళాల కమాండ్ పోస్టుతో పాటు లుహాన్స్క్, డొనెటెస్క్‌లలోని మిలటరీ హెడ్ క్వార్టర్స్‌ను పుతిన్ సందర్శించారు. హెలికాప్టర్ ద్వారా తొలుత ఖేర్సాన్ చేరుకున్న పుతిన్, అక్కడి మిలటరీ అధికారుల నుంచి నివేదికలు స్వీకరించారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ తరువాత ఇక్కడ నుంచి తూర్పు లుహాన్స్క్ ప్రాంతంలోని రష్యన్ నేషనల్ గార్డ్ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. అక్కడ మిలటరీ అధికారుల నుంచి నివేదికలు స్వీకరించారు. ఈ రెండు ప్రాంతాల్లోనూ ఆదివారం నిర్వహించుకునే ఆర్థడాక్స్ ఈస్టర్ సందర్భంగా సైనికులకు శుభాకాంక్షలు తెలిపి, బహుమతులు అందచేశారు. గత నెలలో మారియుపోల్‌లోని అజోవ్ పోర్ట్ సిటీని పుతిన్ సందర్శించిన సంగతి తెలిసిందే.

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం

ఆరోగ్య పర్యవేక్షకురాలి వేధింపులే కారణం!

ప్రజాశక్తి- త్రిపురాంతకం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య పర్యవేక్షకురాలి వేధింపులకు తాళలేక ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితురాలి కథనం ప్రకారం.... నీలం అరుణజ్యోతి త్రిపురాంతకంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్నారు. కరోనా సమయంలో ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారు. ఆ సమయంలో ఆమె చిన్న కుమారుడు కిరణ్ గుండెపోటుతో మరణించడంతో తీవ్ర మనస్తాపానికి గురై అనారోగ్యం బారిన పడ్డారు. ఇటీవల కాలంలో త్రిపురాంతకం పిహెచ్‌సి ఆరోగ్య పర్యవేక్షకురాలు శాంతి ఏంజెల్ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఆశాలపై, ఆరోగ్య కార్యకర్తలపై పెత్తనం చేస్తున్నారు. తనకు లంచం ఇవ్వాలంటూ వేధిస్తున్నారు. లంచం ఇవ్వకపోతే రోజుకో రికార్డు రాయిస్తూ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. నెలలో మూడు రోజులు చేసే ఉద్యోగానికి రూ.10 వేలు వేతనం అవసరమా? మీకు చేతకాకపోతే నాకు డబ్బులు ఇస్తే రికార్డులు రాసుకుంటాను అంటూ వారిని తూలనాడుతూ, తిడుతూ అగౌరవపరుస్తున్నారు. గత శనివారం బ్రహ్మంగారి కాలనీలో తనిఖీలకు వచ్చిన ఆమె అక్కడి ప్రజలు, తోటి ఉద్యోగుల మధ్యలో అరుణజ్యోతిని రికార్డులు చూపించాలని అడిగారు. తన వద్ద ఉన్న రికార్డులను చూపించగా వాటిని ఆరోగ్య పర్యవేక్షకురాలు చించివేయడమే కాకుండా నోటితో ఉచ్చరించలేటువంటి మాటలతో అరుణజ్యోతిని అందరి ముందూ అవమానించారు. దీంతో, తీవ్ర మనస్తాపానికి గురైన అరుణజ్యోతి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని తన వద్ద ఉన్న మాత్రలను ఎక్కువ మొత్తంలో సోమవారం మింగేశారు. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం అందించడంతో కోలుకున్నారు. ఈ విషయమై అరుణజ్యోతి మాట్లాడుతూ ఆరోగ్య పర్యవేక్షకురాలు తనను నానా దుర్భాషలాడుతూ అవమానించారని, మూడు వారాల నుంచి తీవ్రంగా వేధిస్తున్నారని చెప్పారు. లంచం ఇవ్వకపోతే ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తానని హెచ్చరించారని, దీంతో, ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నానని కన్నీరుమున్నీరుగా విలపించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా కార్యకర్త అరుణజ్యోతి

భూమి మాది.. చేపలూ మావే!

- లోకాయుక్త తీర్పును అమలు చేయాలి
- దోసపాడు భూముల్లో చేపలు పట్టిన పేదలు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడులో దళితుల, పేదల భూములకు రక్షణ లేకుండాపోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. వారి భూములను భూస్వాములు, సంపన్నులు ఆక్రమించుకుని అనుభవిస్తోన్నా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దోసపాడులో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన భూ పోరాటంలో ఆయన పాల్గొన్నారు. దళితుల, పేదల భూముల్లో భూస్వాములు అక్రమంగా సాగు చేస్తోన్న చేపలను బాధిత కుటుంబాలతో కలిసి వలలతో పట్టారు. ఈ భూమి మాది, ఈ చెరువులు మావి, ఈ నీళ్లు మావి, ఆ నీటిలో చేపలు మావి అంటూ బాధితులు చేసిన నినాదంతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ భూములు పేదలవి, చేపలూ పేదలవేనని అన్నారు. దోసపాడులో సుమారు 50 ఏళ్ల క్రితం దళితులకు, పేదలకు డి-ఫారం, అసైన్డ్ పట్టాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. కొల్లేరు కాంటూరు, కొల్లేరు ఆపరేషన్ పేరుతో వారిని ఇక్కడి నుంచి భూస్వాములు, పెత్తందారులు, సంపన్నులు తరిమేసి అధికారుల సహకారంతో ఆ భూములను ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ భూముల కోసం 2007 నుంచి పేదలు పోరాడుతున్నా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం భూస్వాముల కొమ్ముకాస్తోందని విమర్శించారు. పైగా, దాడులకు పాల్పడిన భూస్వాములపై ఎటువంటి కేసులూ నమోదు చేయకపోగా, బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయడం శోచనీయమన్నారు. 2014లో పేదలంతా లోకాయుక్తను ఆశ్రయించడంతో 2015లో వారికి అనుకూలంగా రెండుసార్లు తీర్పు వచ్చినా రెవెన్యూ అధికారులు ఇప్పటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. భూస్వాములు అప్పీల్‌కు వెళ్లి ఈ భూములను అక్రమంగా అనుభవిస్తున్నారని తెలిపారు. లోకాయుక్త తీర్పు ప్రకారం ఆ భూములను అసైన్డ్ భూములుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా భూస్వాములపై కేసులు మిగతా 2లో



భూస్వాములు ఆక్రమించుకున్న భూముల్లో పట్టిన చేపలను చూపుతున్న వి.శ్రీనివాసరావు, నాయకులు, పేదలు

25 వరకు అరెస్టు చేయొద్దు

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపి అవినాష్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ నెల 25 వరకు ఆయను అరెస్ట్ చేయవద్దంటూ తెలంగాణ హైకోర్టు మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, అప్పటివరకు సిబిఐ విచారణకు అవినాష్ రెడ్డి ప్రతి రోజూ హాజరు కావాలని, విచారణాధికారులకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది. అవినాష్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ మంగళవారం విచారణ చేపట్టారు. అవినాష్ రెడ్డి తరుపున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు, సిబిఐ వాదనలు విన్న న్యాయమూర్తి పైమేరకు ఆదేశాలు జారీ చేశారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై 25న నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేశారు. కాగా, బుధవారం ఉదయం 10.30 గంటలకు విచారణ నిమిత్తం హాజరు కావాలని అవినాష్ రెడ్డికి సిబిఐ నోటీసులు జారీ చేసింది.



అవినాష్ రెడ్డి

మార్గదర్శి డిపాజిటర్ల చెల్లింపుల్లో రహస్యం ఎందుకు?: సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

డిపాజిటర్లకు చేసిన చెల్లింపుల్లో రహస్యం ఎందుకని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటిదేమీ లేనప్పుడు ఆయా వివరాలు కోర్టుకు అందజేయాలని ఆదేశించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జెబి పార్ధీవాలాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం నుంచి కొన్ని డాక్యుమెంట్లు తీసుకోవాల్సి ఉందని, రెండు వారాలు గడువు ఇవ్వాలని కోరారు. మార్గదర్శి తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి జోక్యం చేసుకుని హైకోర్టు ఆర్డర్‌లో పేరా 27 ప్రకారం ఎవరైనా వివరాలు కావాలని ముందుకొస్తే అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి కన్సెంట్ ఎవరిచ్చారనేది తేల్చాలని న్యాయవాది వైద్యనాథన్‌ను జస్టిస్ జెబి పార్ధీవాలా కోరారు..

బీజాపూర్ ఎమ్మెల్యే కాన్వాయ్‌పై మావోయిస్టుల దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ జిల్లా ఎమ్మెల్యే విక్రమ్ మండావి కాన్వాయ్‌పై మావోయిస్టులు మంగళవారం మెరుపు దాడి చేశారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే తృటిలో తప్పించుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగులూరులో ఓ సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే విక్రమ్ హాజరై తిరిగి బీజాపూర్ వస్తుండగా దండకారణ్యంలో మావోయిస్టులు కాపుకాసి హతమార్చేందుకు ప్రయత్నించారు. కాన్వాయ్‌పై మావోయిస్టులు కాల్పులు జరిపినట్టు స్థానికులు చెబుతున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

బద్వేలు ప్రభుత్వాస్పత్రిలో కరోనా కలకలం

- వైద్యుడు, మరో ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ

ప్రజాశక్తి-బద్వేలు

కడప జిల్లా బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా కలకలం రేపింది. రేగింది. వైద్యుడితో పాటు మరో ఇద్దరు సిబ్బందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మూడు రోజులుగా కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. కరోనా పరీక్షలకు ప్రజలు ముందుకు రాకపోవడంతో తొలుత ఆస్పత్రి సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత ప్రజలూ పరీక్షలు చేయించుకున్నారు. వారందరికీ నెగిటివ్ వచ్చిందని, డాక్టర్‌తో పాటు మరో ఇద్దరు సిబ్బందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. జ్వరం, దగ్గు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.

హరీష్‌రావు వ్యాఖ్యలపై సిఎం జగన్ సమాధానం చెప్పాలి : రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి మంత్రులకు, ఎమ్మెల్యేలకు చేతనైతే ఎపికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణలపై పోరాడాలంటూ తెలంగాణ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో జగన్ అధికారం చేపట్టిన నాలుగేళ్ల కాలంలో ఏ మాత్రమూ అభివృద్ధి జరగలేదని తెలిపారు. వ్యవసాయ, పారిశ్రామిక, నీటిపారుదల రంగాలన్నీ కుదేలయ్యాయని, గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు జగన్ చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు ఎందుకు ఆచరించలేదని ప్రశ్నించారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మెడలు వంచి ఎపికి ప్రత్యేక హోదా సాధిస్తామన్న జగన్ ఇప్పుడు ఎందుకు అడగలేకపోతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

రెండో రోజూ మార్కెట్ల నేల చూపులు

ముంబయి : వరుసగా రెండో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. అమ్మకాల ఒత్తిడితో మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 184 పాయింట్లు కోల్పోయి 59,727కు పడిపోయింది. అదే బాటలో ఎన్ఎస్ఇ నిఫ్టీ 47 పాయింట్లు తగ్గి 17,660 వద్ద ముగిసింది. ఉదయం నుంచి మార్కెట్లకు ఏ దశలోనూ కొనుగోళ్ల మద్దతు లభించలేదు. విద్యుత్, టెలికాం రంగ షేర్లు ఎక్కువ ప్రతికూలతను ఎదుర్కోవడంతో పాటు మార్కెట్లను నష్టాల్లోకి లాగాయి. బిఎస్ఇలో మిడ్ క్యాప్ 0.5 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.2 శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో వైద్య రంగం, రియాల్టీ సూచీలు ఒక్క శాతం చొప్పున రాణించాయి.

వ్యవసాయ పరపతి సంఘాల్లో ప్రయివేటు పెట్టుబడిపై రైతు, ఉద్యోగ సంఘాలతో చర్చించాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలపై వ్యవసాయ పరపతి సంఘాల్లో (పిఎసిఎస్) ప్రైవేటు పెట్టుబడిని అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా సహకార ఉద్యోగ సంఘాలు సాగిస్తున్న రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిపిఎం రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించింది. ఈ విషయంపై వెంటనే రైతు, ఉద్యోగ సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పిఎసిఎస్‌లను కామన్ సర్వీస్ సెంటర్లుగా మారుస్తూ ఏప్రిల్ 17న రాష్ట్ర ప్రభుత్వం జివో జారీ చేసిందని, దీని ప్రకారం సహకార సంఘాలు చేసే అన్నిరకాల వ్యాపారాలు ప్రైవేటుపరం కానున్నాయని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలూ వీటికి అనుసంధానమవుతాయని. ధాన్యం తదితర పంటల ఉత్పత్తుల సేకరణలో మిల్లర్ల ఇష్టారాజ్యం అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ధాన్యం అమ్ముడుపోక రైతులు నానా అవస్థలు పడుతున్నారని వివరించారు. రికార్డులో మద్దతు ధర చూపిస్తూ ఆచరణలో ధరలను దిగ్గోస్తూ రైతులను ముంచుతున్న వైనం అందరికీ తెలుసని, అందువల్ల తక్షణం జివోని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సహకార రంగంలో ప్రైవేటు వ్యాపారస్తులకు ద్వారాలు తెరుస్తూ 2022 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం 1964 సహకార చట్టానికి సవరణ చేసిందని, దాని ప్రకారం 50 శాతం వాటాలు ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి వెళతాయని వివరించారు.

ప్రైవేట్ ఫైనాన్సింగ్ బ్యాంకు ప్రతినిధులూ ఇందులో చొరబడతారని, కేంద్రం ఒక పథకం ప్రకారం సహకార రంగాన్ని తన చేతుల్లోకి తీసుకుని భూస్థాపితం చేస్తోందని వివరించారు. రైతుల ఆస్తిగా ఉన్న సహకార రంగాన్ని ప్రైవేటు కంపెనీలపరం చేసే ప్రక్రియలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ జివో తీసుకొచ్చిందని, ఇప్పటికే సహకారరంగం రాష్ట్రంలో సగంపైగా దెబ్బతిందని తెలిపారు. సహకార డైరీలు, స్పిన్నింగ్ మిల్లులు, చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పరపతి సంఘాలను కూడా బలి తీసుకుంటున్నారని మండిపడ్డారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో అమూల్‌కు వ్యతిరేకంగా సహకార రంగంలో నందిని డైరీ పటిష్టత కోసం రైతులు సాగిస్తున్న పోరాటం నుండి రాష్ట్రం గుణపాఠం నేర్చుకోవాలని సూచించారు. తక్షణం జివోను ఉపసంహరించుకుని సహకార రంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం రైతు, ఉద్యోగ సంఘాలు చేసే ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

అక్రమ క్వారీయింగ్ నిలిపివేయాల్సిందే

- ఉండవల్లి క్వారీలో టిడిపి ఆందోళన
- పలువురు నాయకుల అరెస్టు, విడుదల



ఉండవల్లి క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు, శ్రేణులు

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉండవల్లి క్వారీలో అక్రమ మైనింగ్ జరుగుతోందని, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డినే దగ్గరుండి చేయిస్తున్నారని ఆరోపిస్తూ టిడిపి మంగళవారం ఆందోళన చేపట్టింది. ఇంటిలిజెన్సీ వారితో తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రెస్‌మీట్ అని చెప్పి పెద్దఎత్తున ఆ పార్టీ కార్యకర్తలు ఉండవల్లి క్వారీ వద్దకు చేరుకుని సిఎంకు, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనుకోని ఈ పరిణామంతో అప్రమత్తమైన తాడేపల్లి సిఐ శేషగిరిరావు పెద్దఎత్తున పోలీసు బలగాలను తీసుకుని ఉండవల్లి క్వారీ వద్దకు చేరుకున్నారు. పోలీసులకు, టిడిపి కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. టిడిపి కార్యకర్తలను పోలీసులు చెల్లాచెదురు చేశారు. ఆ పార్టీ జెండా కర్రలను స్వాధీనం చేసుకున్నారు. దొరికిన వారిని దొరికినట్లు అరెస్టు చేశారు. సుమారు 30 మందిని పెదకాకాని, దుగ్గిరాల, తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత వీరిని సొంత పూచీకత్తుపై మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి విశాఖలోని రుషికొండను మింగితే మంగళగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉండవల్లి కొండను మింగేశారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే బినామీ పేర్లతో ఉండవల్లి కొండను బోడికొండను చేశారని విమర్శించారు. అక్రమ మైనింగ్‌ను నిలిపివేయకపోతే గుంటూరు కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయకుమార్ రెడ్డిల కస్టడీకి కోర్టు అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితులు వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయకుమార్ రెడ్డిల సిబిఐ కస్టడీకి నాంపల్లిలోని సిబిఐ కోర్టు అనుమతించింది. కేసుకు సంబంధించి కీలక సమాచారం సేకరించాల్సి ఉన్నందున ఉదయ కుమార్‌రెడ్డి , వైఎస్ భాస్కర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై... నిందితులిద్దరినీ ఆరు రోజుల పాటు సిబిఐ కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. చంచల్‌గూడ జైల్లో ఉన్న ఇద్దరు నిందితులను బుధవారం నుంచి ఆరు రోజుల పాటు సిబిఐ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. ఇదే కేసులో మరో నిందితుడు అవినాష్ రెడ్డితో కలిసి భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను సిబిఐ ప్రశ్నించనుంది.

జర్నలిస్ట్ హెల్త్‌కార్డుల రెన్యువల్‌కు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులకు అమలు చేస్తున్న హెల్త్‌కార్డులకు సంబంధించి రెన్యువల్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హెల్త్ కార్డులకు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు, రాష్ట్ర సమాచారశాఖలు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్లకు హీరోస్ ఆన్ రోడ్ అవార్డులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సర్వీసులో ఒక్కసారి కూడా ప్రమాదానికి గురికాకుండా ఆర్‌టిసి బస్సులను నడిపిన ఇద్దరు ఎపిఎస్‌ఆర్‌టిసి డ్రైవర్లకు జాతీయ స్థాయిలో అవార్డులు దక్కాయి. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్ (ఎఎస్‌ఆర్‌టియు) సంస్థ ఇచ్చే హీరోస్ ఆన్ రోడ్ అవార్డుకు సింహాచలం డిపోకు చెందిన ఎస్ఎఎన్ రాజు, ఆత్మకూరు డిపోకు చెందిన ఎఎం బాషా ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా ఈ అవార్డుల కోసం ఎంపికైన 42 మంది డ్రైవర్లకు ఢిల్లీలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ట్రోఫీ, ప్రశంసా పత్రంతోపాటు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఎఎం బాషా తన 36 ఏళ్ల 6 నెలల కాలంలో ఒక్క యాక్సిడెంటు కూడా చేయకుండా విధులు నిర్వర్తించారు. ఎస్ఎఎన్ రాజు 33 ఏళ్ల 10 నెలలపాటు యాక్సిడెంట్స్ లేకుండా విధులు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి తరుపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత కోసం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎన్నో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఆర్‌టిసిలలో నిజమైన హీరోలు డ్రైవర్‌లేనని అన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొందిన తమకు జాతీయ స్థాయిలోనూ గౌరవం దక్కడం ఆనందంగా ఉందని ఎస్ఎఎన్ రాజు, ఎఎం బాషా తెలిపారు.

ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలంటే వివి ప్యాట్‌లు లెక్కించాల్సిందే : సుప్రీంలో పిల్

న్యూఢిల్లీ : రాబోయే రాష్ట్ర ఎన్నికల్లో అన్ని వివి ప్యాట్ (ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రెయిల్) లను లెక్కించాలని కోరుతున్న ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. జస్టిస్ ఎం.ఆర్.షా నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం దీన్ని విచారించనుంది. ఎన్‌జిఒ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. తమ ఓటు నమోదైందా లేదా అని ఓటర్లు నిర్ధారించుకునేందుకు గానూ ప్రయోగాత్మక ప్రాతిపదికన ఈ పద్ధతిని చేపట్టేందుకు భారత ఎన్నికల కమిషన్‌కు అవసరమైన ఆదేశాలు జారీ చేయాల్సిందిగా పిల్ కోరింది. సీనియర్ న్యాయవాది దుష్యంత్ దావె అందుబాటులో లేకపోవడంతో ఈ అంశంపై విచారణ వాయిదా పడింది. కమిషన్‌ను ఆదేశించాల్సిందిగా పిల్ కోరింది. పేపర్ ట్రెయిల్‌ను ప్రవేశపెట్టడం ద్వారా మాత్రమే ఇవిఎంల పట్ల ఓటర్ల విశ్వాసాన్ని పొందగలుగుతామని పేర్కొంది. వివి ప్యాట్ స్లిప్ ఏడు సెకన్ల పాటు డిస్‌ప్లే అవడం ద్వారా తమ ఓటు రికార్డయిందా లేదా అని తెలుసుకోవడానికి వీలుంటుంది. "ఓటు నమోదైనట్లుగా లెక్కించబడింది" అనడానికి ఇప్పటివరకు చర్యలు శూన్యం. ఏదైనా తేడా వుంటే నిరూపించుకోవాల్సిన భారం సదరు వ్యక్తిపైనే వుంటుందని పిల్ పేర్కొంది. కరెన్సీ నోట్లను లెక్కించే యంత్రాలతోనే వివి ప్యాట్ స్లిప్‌లను లెక్కించాలనే ప్రతిపాదన భారత ఎన్నికల కమిషన్ నుండి రావడం ఆసక్తికరం. కరెన్సీ లెక్కింపు యంత్రాలను గనక ప్రవేశపెడితే సెకన్ల వ్యవధిలో అన్ని స్లిప్‌లను లెక్కబెట్టవచ్చునని మాజీ సిఇసి ఒకరు వ్యాఖ్యానించారు. ఇవిఎంలు, వివి ప్యాట్‌లు రాజ్యాంగ విరుద్ధమని జర్మనీలో వారి సుప్రీం కోర్టు పేర్కొనడంతో తిరిగి పేపర్ బ్యాలెట్ వ్యవస్థకే మళ్ళారని మాజీ ప్రభుత్వ ఉద్యోగి, ఎన్నికలపై పౌరుల కమిషన్ సభ్యుడైన ఎం.జి.దేవసహాయం వ్యాఖ్యానించారు. అనవసరం, సమయం ఎక్కువ పడుతుందనే కారణంతో భారత ఎన్నికల కమిషన్ వివి ప్యాట్ స్లిప్‌లను లెక్కించే పద్ధతిని తిరస్కరించిందని పిల్ పేర్కొంది. కనీసం 50శాతం వివిపిఎటి స్లిప్‌లను లెక్కించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ చీఫ్ చంద్రబాబు నాయుడు, మరో 21 పార్టీలు పెట్టుకున్న రివ్యూ పిటిషన్‌ను 2019లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గగోయ్ తిరస్కరించారు.

2023-24 సంవత్సరానికి రూ.79,453 కోట్లు రుణం

- కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదన
- బహిరంగ మార్కెట్ ద్వారానే రూ.74,388 కోట్లు
- పాత ప్రతిపాదనలను సవరించిన ఆర్థికశాఖ
- ఆమోదం కోసం కేంద్రంతో చర్చలు


ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-అమరావతి

2023-24 ఆర్థిక సంవత్సరంలో రుణంపై ఆర్థికశాఖ సవరణ ప్రతిపాదనలు కేంద్రానికి పంపింది. మొత్తం రూ.79,453 కోట్లను రుణంగా తీసుకునేందుకు అనుమతించాలని, ఇందులో ఒక్క బహిరంగ మార్కెట్ రుణాల ద్వారానే రూ.74,388 కోట్లు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ఏడాది రాష్ట్ర రుణపరిమితి రూ.43,760 కోట్లుగా కేంద్రం అనుమతించిన మొత్తానికి అదనంగా తిరిగి చెల్లింపుల విభాగం కింద రూ.18,411 కోట్లు, విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసినందుకు గానూ ఇవ్వాల్సిన 0.5 శాతం అదనపు రుణంగా రూ.7,293 కోట్లు, పింఛను నిధుల సర్దుబాటుగా రూ.4,098 కోట్లు, గత కొన్ని సంవత్సరాలుగా పరిమితిని పూర్తిగా వాడుకోకపోవడం వల్ల ఏర్పడిన మిగులు రూ.9,901 కోట్లు తీసుకునేందుకు అనుమతించాలని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న రుణాలపై సెస్, వడ్డీలకు సంబంధించి రూ.3,010 కోట్లు మినహాయించుకుని మిగిలిన రూ.79,453 కోట్లు రుణంగా తీసుకునేందుకు అనుమతించాలన్నారు. గతేడాది చివరివరకు సాగదీసి కేవలం ఐదారు వేల కోట్లకు మాత్రమే అదనంగా అనుమతి ఇచ్చింది.

రుణంగా కోరుతున్న విభాగాల వారీ వివరాలు	(రూ.కోట్లలో)
కేంద్రం అనుమతించినది	43,760
రీపేమెంట్ల అంచనా	18,411
పవర్‌సెక్టార్ రిఫార్మ్స్	7293
పింఛను సర్దుబాటు	3098
గతంలో తక్కువ తీసుకున్నది	9901
పిఎస్‌యు రుణాల మినహాయింపు (-)	3010
మొత్తం	**79,453**

హాస్టళ్లలో వసతులపై వివరాలివ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి - అమరావతి



ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చట్ట నిబంధనల ప్రకారం కనీస మౌలిక వసతుల కల్పన వివరాలు అందజేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. పాఠశాల విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, బిసి సంక్షేమశాఖల ముఖ్య కార్యదర్శులు, పాఠశాల విద్య, సాంఘిక సంక్షేమశాఖల డైరెక్టర్లు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. వారికి చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం మంగళవారం నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంపై కాకినాడ జిల్లా జయప్రకాశ్ నగర్‌కు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురుతేజ పిల్ దాఖలు చేశారు. విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

గుడి భూముల్లో ఇసుక బట్టీలపై స్టే

కృష్ణా జిల్లా, జి కొండూరు మండలం, కవులూరులోని సంతాన వేణుగోపాలస్వామి, ఆంజనేయ స్వామి ఆలయ భూముల్లో ఇసుక బట్టీల నిర్మాణాలపై హైకోర్టు స్టే ఆదేశాలు జారీ చేసింది. ఆలయ భూముల్ని ఆక్రమించుకుని ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటూ విజయవాడకు చెందిన గగ్గర కృష్ణారావు వేసిన పిల్‌ను మంగళవారం చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. ప్రతివాదులైన రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, దేవాదాయశాఖ కమిషనర్, కృష్ణా జిల్లా కలెక్టరుకు నోటీసులు జారీ చేసింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

వైసిపి ఆఫీసుకు భూమిపై పిల్

మచిలీపట్నంలో వైసిపి ఆఫీసు నిర్మాణం కోసం రెండెకరాల కేటాయింపు జిఒ 360పై మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. మచిలీపట్నానికి చెందిన వ్యాపారి బురకా బాలాజీ కరుణశ్రీ దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు విచారణ జరిపింది. తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాత చేస్తామని తెలిపింది.

భూ పరిహార అవార్డు ఇచ్చాక అమలు చేయాల్సిందే

కడప జిల్లా, మలినేనిపట్నం గ్రామస్తులకు భూ పరిహారాన్ని ఖరారు చేస్తూ అవార్డు వెలువడ్డాక దానిని చట్ట ప్రకారం అమలు చేయాల్సిందేనని హైకోర్టు తేల్చి చెప్పింది. కొందరికి భూ సేకరణ పరిహారం చెల్లించకుండా ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. సోమశిల ప్రాజెక్టు భూ సేకరణలో సేకరించిన ఆస్తులకు పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, బోగస్ నిర్మాణాలకు సైతం చెల్లింపులు చేస్తున్నారంటూ కడప, చిన్నచౌక్‌కు చెందిన సామాజిక కార్యకర్త మామిడి ఎల్లారెడ్డి దాఖలు చేసిన పిల్‌ను కొట్టేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. నిర్మాణాలు చేయకపోయినా, లేకపోయినా ఉన్నట్లుగా రికార్డుల్లో చూపించి పరిహారం చెల్లిస్తున్నారని పిటిషనరు తరపున న్యాయవాది రామకోటేశ్వరరావు వాదించారు. ఆఫీసర్ల జాయింట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్, డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో లేని నిర్మాణాలకు కూడా పరిహారం చెల్లిస్తున్నారని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు... అవార్డు జారీ అయ్యాక దానిని అమలు చేయాల్సిందేనని తీర్పు చెప్పింది.

వైద్య పరీక్షల నివేదికలపై పిల్

ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలిచ్చే రిపోర్టులపై పాథాలజీలో పిజి చేసిన మెడికల్ ప్రాక్టీషనర్ సంతకం ఉండాలన్న సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని దాఖలైన పిల్‌ను హైకోర్టు విచారణ జరిపింది. కృష్ణా జిల్లాకు చెందిన జనత సర్వీస్ సొసైటీ అనే ఎన్‌జిఒ అధ్యక్షులు కందుల నారాయణరావు వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. ప్రజారోగ్యానికి సంబంధించిన రిపోర్టులపై విశ్వసనీయత పెరిగేలా 2017లో సుప్రీం కోర్టు జారీ చేసిన గైడ్‌లైన్స్ అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనరు తరపున న్యాయవాది జి నర్సింహారావు కోరారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఇతరులను ఆదేశించిన హైకోర్టు విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

తెలుగు భాషాభివృద్ధికి చర్యలు నివేదించండి

తెలుగు భాషాభివృద్ధి సంస్థ చేపట్టిన తెలుగు భాషాభివృద్ధి చర్యలను నివేదించాలని హైకోర్టు ఆదేశించింది. ఆ సంస్థను ప్రతివాదిగా చేయాలని పిటిషనరును ఆదేశించింది. అధికార భాషా చట్టం అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన పిల్‌పై ఆ సంస్థ దాఖలు చేసే కౌంటర్ పరిశీలించాకే ఉత్తర్వుల జారీ అంశంపై తగిన నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు స్పష్టం చేసింది. విచారణ జూన్ 22కు వాయిదా పడింది.

'వివేకా' హత్య కేసు విచారణ పేరుతో డ్రామాలు : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణ అంతా టిడిపి, సిబిఐ ఆడుతున్న డ్రామాగా మారిందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. టిడిపి చెప్పినట్లు సిబిఐ కుట్రపూరితంగా విచారణ చేస్తోందన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ హత్యపై టిడిపి కల్పితాలతో తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. హత్యలో నేరుగా పాల్గొన్న దస్తగిరితో రాజకీయ స్టేట్‌మెంట్లు ఇప్పిస్తున్నారని పేర్కొన్నారు. ముందుగా నిర్ణయించుకున్నట్లుగానే దర్యాప్తును వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిని ఇరికించేలా సిబిఐ చేస్తోందన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టను దిగజార్చేలా కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న వుండగా, అప్రూవర్ మాటల్ని ఎందుకు సిబిఐ పట్టించుకుంటోందని ప్రశ్నించారు. ఈ కేసులో సిబిఐ పేర్లను చేర్చుకుంటూ పోతుంటే టిడిపి ప్రింట్లు వేస్తోందన్నారు. దర్యాప్తు పేరుతో జరుగుతున్న ఈ కుట్రపూరిత తతంగాన్ని ఎదుర్కొంటామని తెలిపారు. అక్రమంగా వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిపై పెట్టిన కేసులు నిలవవని, చివరకు న్యాయమే గెలుస్తుందని అన్నారు.

ఆకిరి రామకృష్ణారావు కన్నుమూత

ప్రజాశక్తి- కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



ఆకాశవాణి, దూరదర్శన్ వార్తా విభాగం ఇన్‌ఛార్జిగా పనిచేసిన ఆకిరి రామకృష్ణారావు (78) మంగళవారం విశాఖపట్నంలోని తన స్వగృహంలో కన్నుమూశారు. పలువురు ఆయనకు నివాళ్లర్పించారు. అంత్యక్రియలు బుధవారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. రామకృష్ణారావు ఎక్కువ కాలం ఆకాశవాణి, దూరదర్శన్ వార్తా విభాగం ఇన్‌ఛార్జిగా పనిచేశారు. జర్నలిస్టులతో సత్సంబంధాలు నిత్యం కలిగి ఉండేవారు. ఎంతో ఆత్మీయత కనబరిచేవారు. రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, ఇతర వివిఐపిల పర్యటన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించేవారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజీవ్ గాంధీ హత్యకు గురైన సమయంలోనూ, 1993లో లాతూరు భూకంప సమయంలోనూ అక్కడికి వెళ్లి మంచి కవరేజీ ఇచ్చారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రులు అందరితోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. రామకృష్ణారావు మృతి పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అదపాక సత్యారావు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామకృష్ణారావు మృతి పట్ల ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, సీనియర్ పాత్రికేయులు ఎన్. వేణుగోపాలరావు, ఎన్ఎజె నాయకులు ఎస్ కొండయ్య, ఎ అమరయ్య, ఎపిబిజెఎ నాయకులు కె మునిరాజు, వీసం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు.

108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులుగా కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి కిరణ్‌కుమార్, కెవివి నరసింహారావు ఎన్నికయ్యారు. యూనియన్ రాష్ట్ర కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షులుగా ఎవి నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంటుగా ఆర్ శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంటుగా ఎస్ మోషే, సంయుక్త ప్రధాన కార్యదర్శిగా ఎం శ్రీనివాసరావు, కోశాధికారిగా టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎం ఈరన్న, సిహెచ్ శివ శ్రీనివాసరావు, కార్యదర్శులుగా డి మస్తాన్‌వలి, శివకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా జిటిఎస్ ప్రసాద్, పి రమణ, కె మృత్యుంజయరావు, ఎస్ సాంబశివరావు, షేక్ ఖాజావలి, నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి, సిహెచ్ రవికుమార్, ఎన్ చంద్రబాబు నాయుడు, తెర్లి వెంకట రమణ, గొర్లి అప్పలనాయుడు ఎన్నికయ్యారు. మహిళా సబ్ కమిటీ కన్వీనరుగా రాధిక, కో కన్వీనరుగా విజయదుర్గ, కమిటీ సభ్యులుగా పి నాగమణి, కె స్రవంతి, వి పైడిరాజు, గీతాదేవి, ఎ కోమల, రమణమ్మ, ఎస్ పుష్పావతి ఎన్నికైనట్లు ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

పరిశ్రమల ఏర్పాటుకు సంస్థలు సిద్ధం

- నేడు మూలపేట పోర్టుకు సిఎం శంకుస్థాపన : మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న ఎంఒయులు ఒక్కొక్కటిగా కార్యరూపం దాలుస్తున్నాయని, ఇప్పటికే 99 వాణిజ్య సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. నగరంలోని స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు కంపెనీలు ముందుకు వస్తోన్న నేపథ్యంలో స్థల పరిశీలన జరుగుతోందని, ఇందుకు చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో రెండు కమిటీలు అధ్యయనం చేస్తున్నాయని వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా మూలపేట వద్ద రూ.మూడు వేల కోట్ల వ్యయంతో చేపట్టనున్న పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం తీరు విడ్డూరం

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను విక్రయిస్తామని కేంద్రం చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. నష్టాల్లో ఉన్న అనేక పరిశ్రమలను కేంద్రం ఇప్పటికే నడుపుతోందని, అటువంటప్పుడు స్టీల్‌ప్లాంట్‌ను నడపడానికి ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించకూడదన్నది తమ ప్రభుత్వ అభిమతమని, ప్లాంట్ ప్రయివేటీకరణను నిరసిస్తూ కార్మికులు చేపడుతున్న ఉద్యమాలకు రాష్ట్ర ప్రభుత్వం దన్నుగా నిలుస్తుందని తెలిపారు.

స్వామి విజయ్‌కుమార్‌ను సిఎం వద్దకు నేనే తీసుకెళ్లా : వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ దూకుడు పెంచిన నేపథ్యంలో లాబియింగ్ కోసం స్వామి విజయ్‌కుమార్‌ను సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన వద్దకు పిలిపించుకున్నారంటూ వస్తున్న వార్తలను టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఖండించారు. రామోజీరావు బంధువుల ప్రత్యేక విమానంలో స్వామి విజయ్‌కుమార్ విజయవాడ వస్తే.. తానే సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఇంటికి తీసుకెళ్లానని వివరించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయ్‌కుమార్‌ను కడప ఎంపి అవినాష్‌రెడ్డి కేసులో లాబీయింగ్‌కి వాడుకుంటున్నారనడం సరైంది కాదన్నారు. తనకు 2007 నుంచి విజయ్ కుమార్ తెలుసన్నారు. విజయకుమార్‌ను ఎందుకు తీసుకొచ్చారో తెచ్చిన వాళ్లు చెప్పాలని డిమాండ్ చేశారు. వివేకానందరెడ్డి హత్య కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. నిజాలు తేల్చే పద్ధతిలో విచారణ జరగాలన్నారు. వివేకాకు వున్న సంబంధాల గురించి ఫోటోలు చూస్తున్నామని, సునీత భర్త రాజశేఖర్‌రెడ్డి పాత్రపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

భూమి మాది.. చేపలూ మావే!

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేయాలని, భూములను స్వాధీనం చేసుకుని దళితులకు, పేదలకు అప్పగించి పూర్తి స్థాయిలో పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే సహకార సంఘాల ద్వారా వారు చేపల చెరువులను అనుభవించేందుకు, చేపలు పట్టుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పేదల భూములను అక్రమంగా అనుభవిస్తోన్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో ఉన్న నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.మహంకాళిరావు, జె.మహేష్, సిహెచ్.మాధవ, పి.ఆనందరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, సిఐటియు నాయకులు జె.గోపి, దోసపాడు గ్రామ పేదలు, దళితులు పాల్గొన్నారు.

ప్రతి నిరుపేద కుటుంబానికీ జాబ్‌కార్డు : బి రాజశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి నిరుపేద కుటుంబానికీ జాబ్‌కార్డు ఇవ్వడంతోపాటు వారందరూ పనిలోకి వచ్చేలా అవగాహన కల్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ తెలిపారు. ప్రతి కుటుంబానికీ 100 రోజులు పని కల్పించడానికి అవసరమైన పనుల అర (షెల్ఫ్ ఆఫ్ వర్క్స్)లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో మంగళవారం 26 జిల్లాల పిడి, డ్వామాల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డిమాండ్ ఆధారంగా ప్రణాళికలు తయారుచేసుకుని, ప్రతి కుటుంబానికీ ఆదాయం వచ్చే చర్యలు తీసుకోవాలన్నారు. పేదరికం తగ్గింపు, వలసల నివారణ, మహిళా సాధికారత, వ్యక్తిగత ఆస్తుల ఏర్పాటు తదితర అంశాల ప్రాధాన్యంగా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తూ అన్ని సూచికల్లో అభివృద్ధి సాధించాలన్నారు. చెంచులకు 150 రోజుల పని కల్పనపై ఆలోచన చేయాలని, తరచూ క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, మాజీ ఐఎఎస్ శంకరన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

రేపు శ్రీవారి ఆర్జితసేవా టికెట్లు విడుదల

ప్రజాశక్తి - తిరుమల

జులై నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటాను ఏప్రిల్ 20న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనునట్లు టిటిడి ఓ ప్రకటనలో పేర్కొంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవాటికెట్ల కోటాను 20న ఉదయం 11.30, శ్రీవాణి ట్రస్టు టికెట్లను మధ్యాహ్నం మూడు గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను 21న ఉదయం 10 గంటలకు విడుదల కానున్నాయి వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మే నెలలో ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఏప్రిల్ 21న మధ్యాహ్నం మూడు గంటలకు ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల కానున్నాయి. వర్చువల్ సేవలు, దర్శన స్లాట్లకు సంబంధించిన మే నెల కోటాను 24న ఉదయం 10 గంటలకు, జూన్ నెల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు విడుదల చేయనుంది. మే, జూన్ నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు, మే నెలకు సంబంధించి తిరుమలలో గదుల కోటాను 26న ఉదయం 10 గంటలకు, తిరుపతిలో గదుల కోటాను 27న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

పారిశ్రామిక రంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఎపి ఛాంబర్స్ సభ్య సంఘాల సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి, వాటి పరిష్కారానికి ఎపి ఛాంబర్స్ కృషి చేస్తోందని అధ్యక్షులు పైడా కృష్ణప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎపి ఛాంబర్స్) సభ్య సంఘాల సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఛాంబర్స్‌కు అనుబంధంగా ఉన్న 64 సంఘాల్లో 50కిపైగా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరై అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా పారిశ్రామిక విధానం, జిఎస్‌టి, ఇన్సెంటివ్‌లు, లాజిస్టిక్స్, సదుపాయాల కల్పన తదితర అంశాలపై జరిగిన ఈ చర్చలో పలు సంఘాల సభ్యులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎపి ఛాంబర్స్ అధ్యక్షులు పైడా కృష్ణప్రసాద్, అధ్యక్షులు (ఎలక్ట్) పి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, ట్రెజరర్ అక్కయ్యనాయుడు మాట్లాడారు. కొత్త పారిశ్రామిక విధానంలో వచ్చిన మార్పులపై సభ్యులు ఎక్కువ మంది తమ అభిప్రాయాలు తెలిపారని, దీనిపై ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్సెంటివ్స్ విడుదల చేయకపోవడంతో మైక్రో, చిన్నతరహా పరిశ్రమలు ఒత్తిడికి గురవుతున్నాయని, వెంటనే ఇన్సెంటివ్‌లు విడుదల చేయాలని తెలిపారు. హోటల్ రంగానికి పారిశ్రామిక హోదా కల్పించాలని కోరారు. 24 గంటలూ నిర్వహించుకునేలా ప్రభుత్వాన్ని కోరాలని అనేక మంది కోరారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ ఖర్చు పెరిగిందని, దీన్ని తగ్గించడంపై కేంద్రం దృష్టి సారించాలని కోరారు. అనేక అంశాలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి వివరించడంతో సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఛాంబర్స్ కృషి ఫలితంగానే ప్రస్తుతం పారిశ్రామికవేత్తలకు కొంత ఊరట లభించిందని తెలిపారు. రాష్ట్రంలో అన్ని విభాగాలకూ నాయకత్వం వహిస్తున్న అతిపెద్ద సంఘం ఎపి ఛాంబర్స్ అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న అనేక పాలసీలకు తగు సూచనలు, సలహాలు ఇస్తూ ఇబ్బందులు లేని విధంగా రూపొందించేందుకు కృషి చేస్తోందని వివరించారు. ఎంఎస్‌ఎంఇ రంగానికి మరిన్ని రాయితీలు కల్పించాలని కోరారు.



సమావేశానికి హాజరైన ఎపి ఛాంబర్స్ ప్రతినిధులు

అశ్రు నయనాల నడుమ 'మళ్ల' అంత్యక్రియలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సిపిఎం అనకాపల్లి జిల్లా సీనియర్ నాయకులు మళ్ల సత్యనారాయణ అంత్యక్రియలు మంగళవారం అశ్రు నయనాల నడుమ సాగాయి. వందలాది మంది సిపిఎం, ప్రజా సంఘాల కార్యకర్తలు, అన్ని రాజకీయ పార్టీల నేతలు, అనకాపల్లి పట్టణ వాసులు తమ అభిమాన నేతను కడసారి చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూడిమడక రోడ్డులోని సత్యనారాయణ ఇంటి నుంచి ప్రారంభమైన అంతిమ యాత్ర ఆర్‌టిసి కాంప్లెక్ ఎదురుగా ఉన్న దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక నిలయానికి చేరుకుంది. అక్కడ మళ్ల పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. అనంతరం అంతియ యాత్ర నెహ్రూ చౌక్ జంక్షన్ మీదుగా గవరపాలెం సంతబయలు శ్మశాన వాటిక వరకూ సాగింది. దారిపొడవునా ప్రజలు నివాళ్లర్పించారు. తొలుత మళ్ల సత్యనారాయణ స్వగృహం వద్ద సిపిఎం అనకాపల్లి మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో ఎంపి డాక్టర్ బి వెంకటసత్యవతి మాట్లాడుతూ విలువలతో బతికిన సిపిఎం నాయకుడు మళ్ల సత్యనారాయణ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ అనకాపల్లిలో వర్తక, కార్మిక సంఘాలు ఏర్పాటు చేయడంలో సత్యనారాయణ విశేష కృషి చేశారని తెలిపారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె లోకనాథం మాట్లాడుతూ విద్యార్థి సంఘం నుంచి తుది శ్వాస విడిచే వరకూ మళ్ల సత్యనారాయణ అనేక పోరాటాలను నిర్వహించారని గుర్తు చేసుకున్నారు.


వందలాది మందితో సాగుతున్న మళ్ల సత్యనారాయణ అంతిమయాత్ర

పలువురు నివాళి

సత్యనారాయణ పార్థివ దేహం వద్ద సిపిఎం సీనియర్ నాయకులు ఎ బాలకృష్ణ, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, సిఐటియు నేతలు ఆర్ శంకరరావు, జి కోటేశ్వరరావు, గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొడ్డేడ ప్రసాదరావు, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణరావు (పెదబాబు), విల్లూరి పైడారావు నివాళ్లర్పించారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పరామర్శించారు.

టిడిపి కౌన్సిలర్ హత్య

- పార్టీలో ఆధిపత్యపోరే కారణమా?

ప్రజాశక్తి- రేపల్లె (బాపట్ల)



గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో బాపట్ల జిల్లా రేపల్లె పట్టణంలోని 14వ వార్డు టిడిపి కౌన్సిలర్ అన్నె రామకృష్ణ (50) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. తన పశువుల పాక నుంచి శనివారం రాత్రి రామకృష్ణ ఇంటికి వెళ్తుండగా నిజాంపట్నం రోడ్డులోని దుర్గారైస్ సమీపంలో గుర్తు తెలియని దుండగులు కర్రలు, కత్తులతో ఆయనపై దాడి చేశారు. రామకృష్ణ కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి రావడంతో దుండగులు పారిపోయారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆయనను రేపల్లె నుంచి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య పది మందిపై అనుమానం వ్యక్తం చేశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు .టిడిపిలో నెలకొన్న ఆధిపత్య పోరే రామకృష్ణ మృతికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

రూ.180 తగ్గిన బంగారం ధర

న్యూఢిల్లీ : దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధర స్వల్పంగా తగ్గినప్పటికీ రూ.60వేల ఎగువనే కొనసాగుతోంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడిపై రూ.180 తగ్గి రూ.60,300గా ఉందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ వెల్లడించింది. ఇంతక్రితం సెషన్‌లో ఈ లోహం ధర రూ.60,480 వద్ద ముగిసింది. పసిడి బాటలోనే కిలో వెండిపై రూ.240 తగ్గి రూ.75,780 వద్ద నమోదయ్యింది.


కర్నూలు జిల్లా దేవనకొండ మండలం అలారుదిన్నె వద్ద పాదయాత్రలో లోకేష్

స్టడీ సర్కిళ్లు తెరుస్తాం

- యువగళం సభలో లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

జగన్ ప్రభుత్వం బిసి, ఎస్‌సి, స్టడీ సర్కిళ్లను మూసివేసిందని, టిడిపి అధికారంలోకి రాగానే వాటిని మళ్లీ తెరుస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళంలో భాగంగా 74వ రోజు పాదయాత్ర మంగళవారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో సాగింది. దేవనకొండ మండలం పల్లెదొడ్డి క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర గద్దెరాళ్ల, దేవనకొండ, కుంకునూరు క్రాస్, అలారుదిన్నె మీదుగా ఆస్పరి మండలం వలిగొండ క్రాస్ వరకు కొన సాగింది. పలు ప్రాంతాల్లో రైతులు, మహిళలు, దళితులు, విద్యార్థులతో లోకేష్ మాట్లాడారు. వలిగొండ క్రాస్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ 26 వేల మంది బిసిలపై వైసిపి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టిందని, తాము అధికారంలోకి రాగానే బిసిల రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేస్తామని అన్నారు. నిత్యావసర ధరలు, పన్నులు తగ్గించే బాధ్యత తీసుకుంటామని, జాతీయ ఉపాధి హామీ కింద కూలీలకు చెల్లించే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మన రాష్ట్రాన్ని నష్టం కలిగించే కర్ణాటకలో అప్పర్‌తుంగ ప్రాజెక్టు పనులు జరుగుతుంటే జగన్ కనీసం మాట్లాడటం లేదన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజలపై భారం మీద భారాలు మోపిందని, చివరికి పీల్చే గాలిపైనా పన్ను వేసేటట్టు ఉందని దుయ్య బట్టారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆలూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోట్ల సుజాతమ్మ, టిడిపి నాయకులు వైకుంఠం జ్యోతి, వైకుంఠం మల్లికార్జున పాల్గొన్నారు. అనంతరం వలిగొండ క్రాస్ క్యాంప్ సైట్‌లో బసచేశారు. మొత్తంగా మంగళవారం 13.3 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది.



భారత్‌లో ఆపిల్ తొలి రిటైల్ స్టోర్ ప్రారంభం

ముంబయి : భారత్‌లో ఆపిల్ తొలి రిటైల్ స్టోర్ ప్రారంభమైంది. ముంబయిలోని బాంద్రా కుర్లా కాంప్లేక్స్‌లో ఏర్పాటు చేసిన 'ఆపిల్ బికెసి'ని మంగళవారం ఆ కంపెనీ సిఇఒ టిమ్ కుక్ వేడుకగా ప్రారంభించారు. ఆయనే స్వయంగా ద్వారాలు తెరిచి.. వినియోగదారులను లోపలికి అహ్వానించారు. ఈ స్టోర్‌ను 20,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. రెండో స్టోర్‌ను ఢిల్లీలో తెరువనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థకు 500 రిటైల్ స్టోర్లు ఉన్నాయి. భారత్‌లోని విస్తృతావకాశాలపై ఆపిల్ దృష్టి సారించింది.

పుల్వామా ఘటనపై మోడీ సమాధానం చెప్పాలి

- కొలనుకొండ శివాజీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

40 మంది జవాన్లను పొట్టనపెట్టుకున్న పుల్వామా దాడి ఘటనపై ప్రధాని మోడీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఎఐసిసి సభ్యులు కొలనుకొండ శివాజీ డిమాండ్ చేశారు. 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా దాడిలో ప్రభుత్వ వైఫల్యం ఉందని తేలిందని, ఈ విషయంపై జమ్ముకాశ్మీర్ మాజీ గవర్నరు సత్యపాల్‌మాలిక్ అనేక విమర్శలు చేశారని పేర్కొన్నారు. దేశభక్తి ముసుగులో దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మోడీ, అమిత్‌షాకు ఒక్క క్షణం కూడా ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



వైద్యారోగ్య రంగంలో దేశంలోనే ఎపి రోల్ మోడల్

ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యారోగ్య రంగంలో దేశంలోనే ఎపి రోల్ మోడల్‌గా నిలిచిందని, ఎకో ఇండియా సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య వ్యవస్థ బలోపేతం, సిబ్బంది సామర్థ్యం పెంచేలా ఎకో ఇండియా ఆధ్వర్యాన ఎకో ప్రాజెక్టుపై నిర్వహించే రెండు రోజుల సదస్సును మంగళవారం విజయవాడ బందరు రోడ్డులోని లెమన్‌ట్రీ హోటల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. ఎకో ఇండియాతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా పలు వైద్య కార్యక్రమాలపై వైద్య సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, బిపి, షుగర్, కేన్సర్ బాధితులకు నాణ్యమైన వైద్యసేవలందేలా శిక్షణ ఉంటుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభించిన తర్వాత ప్రతి వ్యక్తి ఆరోగ్య డేటా డిజిటలైజ్డ్ చేస్తున్నామన్నారు. ఎమర్జెన్సీ కేసుల్లో చాలా మంది స్థానిక ఆస్పత్రులపైనే ఆధారపడతారని, అందుకే గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్యం అందించేలా వైద్య సిబ్బందికి శిక్షణ ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో అధికారికంగా కోవిడ్ మరణాలు నమోదు కాలేదన్నారు. రాష్ట్రానికి 20 లక్షల డోసుల కోవిడ్ వ్యాక్సిన్ కావాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరామన్నారు. జాతీయ రహదారుల పక్కన 13 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటుచేశామని కృష్ణబాబు వెల్లడించారు. వైద్యారోగ్యశాఖ కమిషనరు, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ జె నివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్యారోగ్య విభాగాన్ని బలోపేతం చేయడంలో భాగమే ప్రాజెక్టు ఎకో అని అన్నారు. ఎకో ప్రాజెక్టు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సందీప్ భల్లా మాట్లాడుతూ.. ఎపి వైద్యారోగ్యశాఖ కార్యక్రమాల అమలుకు, వాటిని బలోపేతం చేసేందుకు ఎకో ప్రాజెక్టు ఉపయోగపడుతుందన్నారు. 180 దేశాల్లో ఎకో ప్రాజెక్టు సేవలు అందిస్తోందన్నారు. 2008లో భారత్ ప్రారంభించామన్నారు. దేశంలో 20 రాష్ట్రాలతో ఎకో ఇండియా సంస్థ ఎంఒయు చేసుకుని ఎకో ప్రాజెక్టు ద్వారా డాక్టర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, నర్సులు, డెంటిస్టులు, ఆశా, ఎఎన్ఎమ్, వైద్య సంబంధిత స్పెషలిస్టులు... ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు పరికరాలను ఉపయోగించడంలో నాణ్యమైన శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఇమ్యునైజేషన్ అధికారి ఎల్‌బిఎస్ హెచ్ దేవి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం


'పుల్వామా' ప్రశ్నలు

జమ్ము-కాశ్మీర్ లోని పుల్వామాలో 40 మంది వీరజవాన్లను బలిగొన్న పాకిస్థాన్ ఉగ్రవాద చర్య విషయమై ఆనాటి రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ తెలిపిన వివరాలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. వారు బలికావడానికి పాక్ కుట్రల కంటే మన కేంద్ర ప్రభుత్వం, హోం మంత్రిత్వశాఖ, రక్షణ మంత్రిత్వశాఖ వైఫల్యమే ప్రధాన కారణమని ఆయన వెల్లడించడంతో అప్పట్లో ప్రతిపక్షాల విమర్శలన్నీ వాస్తవాలని తేటతెల్లమయింది. మాలిక్ వెల్లడించిన అంశాలపై మోడీ ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

2019 ఫిబ్రవరి 14.... వీరజవాన్ల శరీరాలు ఛిద్రమై, రహదారులు రక్తమోడిన సమయంలో... మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో ఓ విదేశీ టి.వి ఛానల్ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. పుల్వామా ఘటన మధ్యాహ్నం 3.15 నుంచి 3.30 మధ్య జరిగితే ఆయన సాయంత్రం 6.45 గంటలకు అందుబాట్లోకి వచ్చారు. దేశంతోపాటు ప్రపంచమంతా కలవరపాటుకు గురైన సమయంలో...దాదాపు మూడు గంటలపాటు ప్రధాని అందుబాట్లో లేరు. సత్యపాల్ మాలిక్ తాజా ఇంటర్వ్యూ ప్రకారం....మన లోపాలు, తప్పిదాల వల్లే ఈ ఘటన జరిగిందని చెప్పగా, 'నోర్మూసుకో...ఈ విషయాన్ని బయటకు చెప్పొద్దు' అని ప్రధాని ఆదేశించారు. హోం మంత్రి అమిత్‌షా, భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా ఈ విషయాలేవీ బయట మాట్లాడొద్దని చెప్పారు. అప్పటికి లోక్‌సభ ఎన్నికలకు ఎనిమిది వారాల సమయం మాత్రమే ఉంది. ఈ ఘటనకు ముందు లోక్‌నీతి, ది హిందూ, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలప్‌మెంట్ సొసైటీ జరిపిన సర్వేలో విపరీతంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ కునారిల్లుతుండటం తదితర అంశాలపై ప్రజల తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని, ఎన్నికల్లో ప్రతిఫలిస్తుందని తేలింది. పుల్వామా ఘటన జరిగిన జరిగిన 12వ రోజున భారత యుద్ధ విమానాలు పాకిస్తాన్‌లో చొరబడి బాలాకోట్ ఉగ్రవాద స్థావరంపై బాంబు దాడి చేశాయి. పుల్వామాలో చిందించిన రక్తానికి భారత్ ప్రతీకారం తీర్చుకుందని, 300 మంది ఉగ్రవాదులు హతమయ్యారని మీడియా పేర్కొంది. అనంతరం దేశభక్తి, జాతీయత చుట్టూ ఎన్నికల ప్రచారం సాగింది. భారీ మెజారిటీతో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చింది.

రాష్ట్ర పాలనా యంత్రాంగానికి అధిపతిగా ఉన్న గవర్నర్‌ను వాస్తవాలు వెల్లడించొద్దని ప్రధాని, హోంమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు బెదిరించి అడ్డుకున్నారని వెల్లడికావడమే తాజా సంచలనం. ఆయన లేవనెత్తిన అంశాల్లో ప్రధానమైనది...ఉగ్రవాద ముప్పు తీవ్రంగా ఉన్న తరుణంలో రోడ్డు మార్గంలో వేల మంది సైనికులను పంపించడం సరికాదని, కనీసం ఐదు విమానాలను ఏర్పాటు చేయాలని సిఆర్‌పిఎఫ్ శ్రీనగర్ ఐ.జి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చేసిన విజ్ఞప్తిని బుట్టదాఖలు చేయడం. ప్రాణాలకు ముప్పున్న వీర సైనికులకు విమానాలు కేటాయించకపోవడానికి కారణాలేమిటో ఇప్పటికైనా కేంద్రం సమాధానమివ్వాలి. భద్రతా దళాలు నిత్యం రహదారులను జల్లెడ పడతాయి. ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తాయి. 2,547 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లతో కూడిన 78 వాహనాల కాన్వాయ్ తీవ్రవాద దాడి ముప్పు ఉన్న హై సెక్యూరిటీ జోన్ లోకి ప్రవేశిస్తుండగా, ఓ పేలుడు పదార్థాల వాహనం కూడలి నుంచి దూసుకొచ్చి ఓ ఆర్మీ ట్రక్కును ఢీకొట్టింది. దాంతో, 40 మంది సైనికులు బలయ్యారు. 12 రోజులపాటు వందల కిలోమీటర్లు దాటి, మన భద్రతా చర్యలన్నింటినీ దాటి 300 కిలోలకుపైగా పేలుడు పదార్థాలున్న వాహనం అక్కడికి ఎలా చేరుకోగలిగింది? ఇంత భారీ ఆర్మీ కాన్వాయ్ కదులుతున్నప్పుడు ఉగ్రవాదులు వెనుక రోడ్లపై పేలుడు పదార్థాలతో ఎలా ప్రయాణించారు? సంఘటనకు ముందు రోజు వచ్చిన నివేదికతో సహా 11 ఇంటెలిజెన్స్ నివేదికలు ప్రత్యక్ష ఉగ్రవాద దాడికి అవకాశం ఉందని చెప్పినా బాధ్యులెవరూ ఎందుకు పట్టించుకోలేదు? సిఆర్‌పిఎఫ్ డిమాండ్ చేసినా విమానాలు ఎందుకు ఇవ్వలేదు. ఇంటలిజెన్స్ సెక్యూరిటీ లోపాన్ని ఆరా తీసిన గవర్నర్ నోరు ఎందుకు మూయించారు? మన దేశ భద్రతా ప్రయోజనాలు, రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. పుల్వామాలో ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? ఈ ఘటనను నిరోధించవచ్చా? అనే అంశాలపై వాస్తవాలు తెలుసుకునే హక్కు ప్రతి భారతీయుడికీ ఉంది.

మంచి మాట



విజ్ఞానాన్ని పొందాలనుకుంటే
దానికై పరిశ్రమించక తప్పదు.
శ్రమపడటం అనేది జీవన సూత్రం.

- జాన్ రస్కిన్

'ఆశ్రితుల'కు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులు

విశ్లేషణ



ఎం. వేణుగోపాలరావు

దేశంలో, రాష్ట్రంలో పంపు స్టోరేజ్ జల విద్యుత్ ప్రాజెక్టుల (పి.ఎస్.పి) స్థాపన అవసరాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తూ, వాటిని నెలకొల్పేందుకు ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అనుమతులు, ప్రోత్సాహకాలు భారీగా ఇస్తున్నాయి. కర్బన ఉద్గారాల విడుదలను తగ్గించటం, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ పేరుతో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిని క్రమేణా తగ్గించి వేస్తూ, పునరుత్పత్తి ఇంధన విద్యుత్ (ఆర్.ఇ) స్థాపక సామర్థ్యాన్ని భారీగా చేర్చే లక్ష్యాలను ప్రకటించి, అందుకు ప్రైవేటు ప్రాజెక్టులతో దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకొంటున్నాయి. సౌర విద్యుత్ ప్రాజెక్టులు పగటిపూట సూర్యరశ్మి ఉన్నపుడు, పవన విద్యుత్ ప్రాజెక్టులు ప్రధానంగా వర్షాకాలంలో గాలి వేగం బాగా ఉన్నపుడు విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. ఆ విధంగా ఆ ప్రాజెక్టుల నుండి పీక్ సమయాలలో, సీజన్లలో డిమాండు తీర్చేందుకు విద్యుత్ లభించదు. ఆ లోటును తీర్చేందుకు పి.ఎస్.పి లను, మిగులు విద్యుత్తును బ్యాటరీలలో నిల్వ ఉంచి, అవసరమైనపుడు వాడుకొనే పద్ధతిని, ఎప్పుడు అవసరమైతే అప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, ఉత్పత్తి నిలుపు చేయడానికి సాంకేతికంగా వీలున్న గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులను వినియోగించు కోవాలని ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. విద్యుత్తును వినియోగించి గ్రీన్ హైడ్రోజన్‌ను తయారు చేసి, అవసరమైనపుడు దానిని విద్యుత్‌గా మార్చి సరఫరా చేసే విధానంపై కూడా మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. చివరి మూడు ప్రత్యామ్నాయాలు ప్రస్తుతం చాలా ఖరీదైనవి కావటంతో, పి.ఎ.స్.పి లకు ముందు ప్రాధాన్యత ఇస్తున్నాయి.

పి.ఎస్.పి లు రెండు రకాలు. నదీజలాల వినియోగానికి ఇప్పటికే రిజర్వాయర్లు ఉన్న చోట పి.ఎస్.పి లను ఏర్పాటు చేయటం ఒకటి. దేశంలో, రాష్ట్రంలో కూడా పాటిస్తున్న అంతర్జాతీయ జల వినియోగ సూత్రాల ప్రకారం, నదీ జలాలను ముందు మంచి నీటి అవసరాలకు, తరువాత సాగునీటి అవసరాలకు, పారిశ్రామిక అవసరాలకు వినియో గించుకోవాలి. ఈ అవసరాలకు నీటిని విడుదల చేసే సమయాలలో జల విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలి. రిజర్వాయర్లు నిండి, సముద్రంలోకి నీరు వృధాగా పోయే పరిస్థితులలో, పూర్తిగా జల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ అవసరమైతే థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించే విధానం అమలు జరుగుతున్నది. దీనికి తోడు రివర్సిబుల్ పంపింగ్ విధానం కొన్ని చోట్ల అమలులో ఉంది. రిజర్వాయరు నుండి నీటిని విడుదల చేసినపుడు జల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ, దిగువన నిర్ణీత పరిమాణంలో నీటిని నిల్వ ఉంచే ఏర్పాటు చేసి, రాత్రిపూట, పీక్ ఏతర సమయాలలో లభించే మిగులు విద్యుత్తును వాడి ఆ నీటిని తిరిగి రిజర్వాయరులోకి తోడిపోసి, పీక్ సమయాలలో రిజర్వాయరు నుండి పరిమితంగా నీటిని విడుదల చేసి జల విద్యుత్ ఉత్పత్తి చేసే విధానం అమలులో ఉంది. ఆ పద్ధతిలో ఒక యూనిట్ జల విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటిని తిరిగి రిజర్వాయరు లోకి తోడి పోయ టానికి 1.2 యూనిట్ల విద్యుత్ అవసరమవుతున్నది. ఇలాంటి పద్ధతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలం ఎడమ కాలవ జల విద్యుత్ స్టేషన్, పులిచింతల ప్రాజెక్టు వంటి రెండు మూడు చోట్ల ఉంది. వాటి సామర్థ్యం చాలా పరిమితంగా ఉంది.

రిజర్వాయర్లు లేని చోట ప్రత్యేకంగా పి.ఎస్.పి ల కోసం వాటిని నిర్మించి, అందుబాటులో ఉన్న జల వనరుల నుండి వాటికి నీటిని మళ్ళించి అవసరమనుకున్నపుడు జల విద్యుత్ ఉత్పత్తి చేయటం మరొక విధానం. ఇందుకు అవసరమైన నిర్మాణాలను చేయటం, నిర్వహించటం గణనీయమైన పెట్టుబడితో కూడుకొన్నది. దానికితోడు, అనేక సమస్యలూ ఉన్నాయి.

ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకే

రాష్ట్రంలో 33,240 మెగా వాట్ల సామర్థ్యంతో 29 పి.ఎస్.పి లను ఏర్పాటు చేయవచ్చునని, వాటితో పాటు సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు డిజైన్ చేయవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటి కోసం కడప, కర్నూలు, అనంతపూర్ జిల్లాలలో లక్ష 45 వేల ఎకరాల భూమిని గుర్తించింది. గతేడాది మే లో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యు.ఇ.ఎఫ్) సమావేశంలో, గత నెల విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ పెట్టుబడిదారుల శిఖరాగ్ర సమావేశంలో ఇలాంటి ప్రాజెక్టుల స్థాపనకు ప్రైవేటు పెట్టుబడిదారులతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్నది. ఈ ప్రాజెక్టుల స్థాపనకు డెవలపర్లను ఎంపిక చేయడానికి ఎటువంటి పోటీ బిడ్డింగు విధానాన్ని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించ లేదు. ఇవి పై సమావేశాలలో అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోగలిగే వ్యవహారాలు కావు. అంతకన్నా ముందు అవసరమైన అంశాల పరిశీలన జరపటంతో పాటు, సాధ్యాసాధ్యాలు, ఈ ప్రాజెక్టుల స్థాపనకు భూమి, నీరు, ఇతర అవసరాలను సమకూర్చటంతో పాటు, వాటి స్థాపన వల్ల స్థానిక ప్రజలకు, పర్యావరణానికి తలెత్తే దీర్ఘకాలిక సమస్యలను పరిగణనలో తీసుకొని ఉండాలి. పై సమావేశాలలో ఈ ప్రాజెక్టుల స్థాపనకు ఒప్పందాలు చేసుకొన్నట్లు చూపటం పోటీ బిడ్డింగు లేకుండా, ఆశ్రిత పెట్టుబడిదారులకు ఏకపక్షంగా అనుమతులను ఇవ్వటాన్ని సమర్థించుకొనేందుకు ఆ సమావేశాలను ఒక ముసుగుగా వాడుకొనే ఎత్తుగడే. అనకాపల్లి జిల్లా పెదకోటలో 1500 మె.వా., విజయనగరం జిల్లా రైవాడలో 1000 మె.వా., నంద్యాల జి ల్లా పిన్నాపురంలో 1680 మె.వా., అన్నమయ్య జిల్లా ఒంగిమలలో 1800 మె.వా. పి.ఎస్.పి ల స్థాపనకు అదాని సంస్థకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నంద్యాల జిల్లా ఔక్‌లో 800 మె.వా., అనంతపురం జిల్లా సింగనమల లో 800 మె.వా. పి.ఎస్.పి ల స్థాపనకు అరొబిందోకు, అల్లూరి సీతారామరాజు జిల్లా యర్రవరంలో 1200 మె.వా. ప్రాజెక్టును షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు, వైఎస్‌ఆర్ కడప జిల్లా పైడిపాలెం నార్త్‌లో 1000 మె.వా., పైడిపాలెం ఈస్ట్‌లో 1200 మె.వా. పిఎస్‌పి లను ఇండోసోల్ సోలార్‌కు ప్రభుత్వం కేటాయించింది.



> అటవీ భూములను కూడా ఇందుకు మార్గదర్శక సూత్రాల ప్రకారం మళ్ళింపుకు, సంబంధిత శాఖలకు పి.ఎస్.పి ల కోసం ప్రైవేటు భూముల సేకరణకు లీజు ప్రాతిపదికన డెవలపర్ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. భూ సేకరణకు ప్రైవేటు భూ యజమాని, డెవలపర్ పర్వసర బేరసారాలతో నిర్ణయాలు తీసుకోవాలి. ప్రైవేటు భూములను లీజుకు తీసుకుంటే, ప్రభుత్వ భూములకు ఇచ్చే విధంగానే లీజు మొత్తాలను నిర్ణయించాలని, లీజు మొత్తంలో ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలని, మిగిలిన మొత్తం భూయజమానికి చెల్లించాలని పేర్కొంది. పెట్టుబడిదారుల పబ్బం గడపటానికి, తమ పబ్బం గడుపుకోవటానికి ప్రజా ప్రయోజనాలను, ఇక్కడ ముఖ్యంగా గిరిజన ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను దెబ్బతీయటానికి పాలకులు నిరంకుశంగా వ్యవహరిస్తున్న మూసలోనే ఈ విధానాలున్నాయి.

దావోస్ డబ్ల్యు.ఇ.సి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అదానీ గ్రూపుతో 10 వేల మె.వా. సౌర విద్యుత్, 3700 మె.వా. పిఎస్ పిల స్థాపనకు ఒ ప్పందాలు చేసుకుంది. జల, సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు గ్రీన్‌కో తో, అరబిందో రియాల్టీ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్లతో ఒప్పందాలు చేసుకుంది. గత జూన్ లో జరిగిన రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి (ఎస్‌ఐపిబి) సమావేశంలో అదాని గ్రూపు రూ.15,740 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆమోదం తెలిపింది. పార్వతీపురం, కడప, సత్య సాయి జిల్లాలలో పి.ఎస్.పి ల ఏర్పాటును అదానీ గ్రూపు ప్రతిపాదించింది. పార్వతీపురం జిల్లా కురుకుట్టిలో 1200 మె.వా. పి.ఎస్.పి, కర్రివలసలో 1000 మె.వా. పి.ఎస్.పి, చిత్రావతిలో 500 మె.వా., గండికోటలో 1000 మె.వా. పి.ఎస్.పి లను అదానీ గ్రూపు చేపడుతున్నది. అన్నమయ్య జిల్లాలో రాయవరం, న్యూ ఒగిమల లో వెయ్యి మె.వా. చొప్పున రెండు, గండికోటలో 800 మె.వా. పి.ఎస్.పి ల ఏర్పాటుకు ఫిబ్రవరిలో డెవలపర్ల నుండి ఆసక్తి వ్యక్తీకరణను ఎన్‌రెడ్ కాప్ ఆహ్వానించింది.

పి.ఎస్.పి ని ప్రోత్సహించే విధానాన్ని గత డిసెంబరు 12న రాష్ట్ర ప్రభుత్వం 25వ నంబరు జీవోలో ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర నిబంధనలు లేదా ప్రామాణిక బిడ్డింగు మార్గదర్శక సూత్రాలను ఎప్పటికప్పుడు సవరించిన విధంగా స్వంత వినియోగానికి, రాష్ట్రంలో, బయట విద్యుత్తును అమ్ముకొనేందుకు పి.ఎస్.పి లను నెలకొల్పే డెవలపర్లు అర్హులని జీవోలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుత్పత్తి ఇంధన అభివృద్ధి సంస్థ (ఎన్‌రెడ్ కాప్) ఈ విధానం అమలుకు నోడల్ ఏజెన్సీగా ఉంటుంది. రాష్ట్రంలో పి.ఎస్.పి ప్రాజెక్టులను గుర్తించేందుకు, వాటికి వివరమైన ప్రాజెక్టు నివేదికలను (డిపిఆర్) తయారుచేయటం, డెవలపర్‌కు భూమిని సమకూర్చటం, ప్రాజెక్టుల అమలుకు అవసరమైన అనుమతులన్నిటిని పొందటంలో డెవలపర్లకు సహాయం చేయటం, ప్రభుత్వ విధానాలు, మార్గదర్శక సూత్రాల ప్రకారం ప్రాధాన్యతనిచ్చి నీటి కేటాయింపులకు వీలు కల్పించటం నోడల్ ఏజెన్సీ విధులలో ఉన్నాయి. డెవలపర్ కోరితే, ఎ.పి జెన్‌కో, ఎ.పి ట్రాన్స్‌కో వాటి నైపుణ్యాన్ని, సేవలను పి.ఎస్.పి ల ప్లానింగు, నిర్మాణం, నిర్వహణ కోసం అందించవచ్చు. వాటి కన్సల్టెన్సీ సేవలకు నోడల్ ఏజెన్సీ వీలు కల్పించాలి. ప్రభుత్వ విధానాలు, మార్గదర్శక సూత్రాల ప్రకారం పి.ఎస్.పి లకు ప్రాధాన్యతపై నీటి కేటాయింపుకు నోడల్ ఏజెన్సీ వీలు కల్పించాలి.

ఎ.పి జెన్కోను పట్టించుకోలేదు

జల విద్యుత్ ప్రాజెక్టులను అనాదిగా గతంలో ఎ.పి ఎస్ఇబి, తరువాత ఎ.పి జెన్కో నిర్మించి, నిర్వహిస్తున్న విధానం కొనసాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం తన పి.ఎస్.పి విధానంలో ఎ.పి జెన్కో ఇలాంటి ప్రాజెక్టులను నెలకొల్పే ప్రతిపాదన కూడా చేయలేదు. ప్రస్తుతమున్న డ్యాంల వద్ద సాధ్యాసాధ్యాలను బట్టి జెన్కోతో పి.ఎస్.పి లను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవచ్చు. అయినప్పటికి, ముఖ్య మంత్రి, విద్యుత్ మంత్రి, సంబంధిత అధికారుల ఉపన్యాసాలలో, ప్రకటనలలో కూడా అలాంటి ప్రస్తావన కూడా చేయటం లేదు. పి.ఎస్.పి పై ముసాయిదా మార్గదర్శక సూత్రాలను ప్రకటించి, వాటిపై సూచనలను ఆహ్వానించి ఈ నెల 10వ తేదీన కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ మార్గదర్శక సూత్రాలను ప్రకటించింది. ప్రైవేటు డెవలపర్లు పి.ఎస్.పి లను నెలకొల్పటానికి ప్రోత్సహించేందుకు అనేక రాయితీలు కల్పించాలని పలు ప్రతిపాదనలను చేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు (ఎన్.టి.పి.సి, జెన్కో వంటివి) నామినేషన్ ప్రాతిపదికపై పి.ఎస్.పి లను ఇవ్వవచ్చునని కేంద్ర మార్గదర్శక సూత్రాలలో పేర్కొన్నారు. ప్రైవేటు డెవలపర్లకు రెండు దశల పోటీ బిడ్డింగు ద్వారా కూడా పి.ఎస్.పి లను కేటాయించవచ్చు అని పేర్కొన్నారు. పి.ఎస్.పి లను నెలకొల్పేందుకు ప్రైవేటు డెవలపర్లకు సేవలందించేందుకు ఎ.పి జెన్కో సామర్థ్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగంలో పి.ఎస్.పి లను నెలకొల్పాల్సిన అవసరాన్ని పూర్తిగా విస్మరించి, ప్రైవేటు పెట్టుబడిదారుల పబ్బం గడపటమే తన పరమావధిగా వ్యవహరిస్తున్నది. తన విధానాన్ని రూపొందించే ముందు మొక్కుబడిగానైనా ఆసక్తిగల వారి సూచనలను తెలుసుకొనే ప్రయత్నం కూడా రాష్ట్ర ప్రభుత్వం చేయలేదు.

గిరిజనుల ప్రయోజనాలు బలి

అమలులో ఉన్న కేంద్ర జల విద్యుత్ విధానం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు జల విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు డెవలపర్లను ఎంపిక చేయడానికి రెండు దశల పారదర్శక బిడ్డింగు విధానాన్ని అనుసరించాలి. అందుకు 12 శాతానికి పైగా ఉచితంగా విద్యుత్ ఇవ్వటం, వాటా పెట్టుబడి, ముందుగా చెల్లింపులు, తదితర అంశాల ప్రాతిపదికన డెవలపర్లను ఎంపిక చేయాలి. డిపిఆర్ ను సంబంధిత కేంద్ర సంస్థలు పరిశీలించాక, కేంద్ర విద్యుత్ అథారిటీ (సిఇఎ) అనుమతి లభించాక ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలి. అటవీ హక్కుల చట్టం (ఎఫ్‌ఆర్‌ఎ), షెడ్యూల్డు ప్రాంతాలకు పంచాయతి విస్తరణ చట్టం (పిఇఎస్‌ఎ) వంటి చట్టాల నిబంధనలను పాటించాలి. సంబంధిత మంత్రిత్వ శాఖ నుండి పరిసరాల, పర్యావరణ, అటవీ అనుమతులను పొందాలి.

పెసా చట్టం గిరిజనుల, షెడ్యూలు ప్రాంతాలలో నివసించే వారి హక్కులు కాపాడేలా గ్రామ సభల ద్వారా స్వయం పాలనను చట్టబద్ధంగా గుర్తిస్తుంది. సహజ వనరులపై వారి సాంప్రదాయక హక్కులను గుర్తిస్తుంది. అభివృద్ధి ప్రణాళికలను అనుమతించటంలో, అన్ని రంగాలను నియంత్రించటంలో గ్రామసభల కీలక పాత్రకు పెసా అధికారం కల్పించింది. ఒక గ్రామ ప్రజల సాంస్కృతిక, సాంప్రదాయాలను కొనసాగించటం, గిరిజనుల ప్రయోజనాలను దెబ్బ తీసే పథకాలను, సహజ వనరులను నియంత్రించటానికి గ్రామ సభలకు అధికారాలను కల్పించింది. గ్రామ సభలు నియంత్రించే అంశాలలో జల్, జంగిల్, జమీన్ (నీరు, అటవి, భూమి) వనరులు ఉన్నాయి. షెడ్యూలు ప్రాంతాల "ప్రాజెక్టులను అమలు చేసేటపుడు వాటివల్ల చేకూరే ప్రయోజనాలను స్థానిక ప్రజలతో అర్థవంతంగా పంచుకొనేందుకు స్థానిక ప్రాంత అభివృద్ధి నిధిని (ఎల్.ఎ.డి.ఎఫ్) తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

పి.ఎస్.పి లకు సంబంధించి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని ఈ చట్టాలను ఉల్లంఘిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం పిఎస్‌పిలను ప్రోత్సహించే విధానం పేరుతో జారీ చేసిన జీవో, మోడీ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శక సూత్రాలు సంబంధిత చట్టాలకు విరుద్ధంగా ఉన్నాయి. అవి చట్టాలను ఉల్లంఘించటమే. గిరిజన ప్రాంతాల ప్రజల హక్కులను, సంస్కృతీ సాంప్రదాయాలను, సహజ వనరులపై వారికి ఉన్న హక్కులను కాలరాస్తున్నాయి. మోడీ ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తూ ఏకంగా చట్టాలనే సవరిస్తున్నది. స్థానిక ప్రాంత అభివృద్ధికి సంబంధించి జల విద్యుత్ ప్రాజెక్టులపై కేంద్ర మార్గదర్శక సూత్రాలను, ఆర్ అండ్ ఆర్ నిబంధనలను డెవలపర్లు పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో లో పేర్కొంది. కేంద్రం తాజాగా జారీ చేసిన మార్గదర్శక సూత్రాలలో పి.ఎస్.పి లకు స్థానిక ప్రాంత అభివృద్ధి నిధి అవసరం లేదని, నిర్వాసితుల పునరావాసం, తిరిగి స్థిరపడటం (ఆర్ అండ్ ఆర్) సమస్యలు ఉండవని, అవి ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న బాధ్యతకు మినహాయింపు ఇవ్వాలని, వాటికి రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలు ఇవ్వాలని ఏకరువు పెట్టింది.

పి.ఎస్.పి లకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుండి ఎన్ఓసి లేదా ఆమోదం పొందటం నుండి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ విధానంలో పేర్కొంది. పి.ఎస్.పి లకు ప్రభుత్వ భూమి బదలాయింపు, దీర్ఘకాలిక లీజుకు (ఎకరానికి ఏడాదికి రూ.31 వేలు చొప్పున, రెండేళ్ళకు ఒకసారి 5 శాతం పెంపుదల) ప్రభుత్వ భూమిని సమకూర్చాలని పేర్కొంది. అటవీ భూములను కూడా ఇందుకు మార్గదర్శక సూత్రాల ప్రకారం మళ్ళింపుకు, సంబంధిత శాఖలకు పి.ఎస్.పి ల కోసం ప్రైవేటు భూముల సేకరణకు లీజు ప్రాతిపదికన డెవలపర్ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. భూ సేకరణకు ప్రైవేటు భూ యజమాని, డెవలపర్ పర్వసర బేరసారాలతో నిర్ణయాలు తీసుకోవాలి. ప్రైవేటు భూములను లీజుకు తీసుకుంటే, ప్రభుత్వ భూములకు ఇచ్చే విధంగానే లీజు మొత్తాలను నిర్ణయించాలని, లీజు మొత్తంలో ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలని, మిగిలిన మొత్తం భూయజమానికి చెల్లించాలని పేర్కొంది. పెట్టుబడిదారుల పబ్బం గడపటానికి, తమ పబ్బం గడుపుకోవటానికి ప్రజా ప్రయోజనాలను, ఇక్కడ ముఖ్యంగా గిరిజన ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను దెబ్బతీయటానికి పాలకులు నిరంకుశంగా వ్యవహరిస్తున్న మూసలోనే ఈ విధానాలున్నాయి. ఈ విధానాలకు వ్యతిరేకంగా, తమ హక్కుల, జీవనోపాధి, సహజ వనరుల రక్షణ కోసం ఇప్పటికే చింతపల్లి, తదితర గిరిజన ప్రాంతాలలో గిరిజనులు ఆందోళనలు చేస్తున్నారు.

/వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు, సెల్ : 9441193749/

ఆత్మనిర్భర్ భారత్‌ను వంచిస్తున్న బిజెపి

సమస్య



కె. లోకనాథం

విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం నిత్యం వంచనలకు పాల్పడుతూనే వుంది. తాజాగా ఏప్రిల్ 13న విశాఖలో ఉక్కు సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే రోజ్‌గార్ మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇప్పటికిప్పుడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని అనుకోవడం లేదు. దీనిపై ప్రస్తుతానికి ముందుకెళ్లడం లేదని ప్రకటించారు. మరలా సాయంత్రం స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ...నా చేతిలో ఏమీ లేదు. ఢిల్లీలో ఉన్న పెద్దల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. దీన్నిబట్టి రిమోట్ కంట్రోల్ ఎవరి చేతిలో వుందో అర్థమవుతోంది. మొన్న జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలకు స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మే విషయంలో తగ్గేదే లేదని సమాధానం చెప్పారు. బిజెపి ప్రకటనలు ప్రజలను పక్కదారి పట్టించే విధంగా ద్వంద్వనీతిని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్టీల్ సహాయ మంత్రి ఉదయం ఒక ప్రకటన సాయంత్రం ఒక ప్రకటన చేయడమంటే తెలుగు ప్రజలను, పోరాటం చేస్తున్న కార్మికులను మోసం చేయటమే. కేంద్ర ప్రభుత్వం మొదటి నుండి ఆంధ్ర రాష్ట్రానికి అన్ని అంశాలలో అన్యాయం చేస్తోంది. స్టీల్‌ప్లాంట్ అమ్మకం విషయంలో బరితెగించి ముందుకు పోతూ అనేక జీవోలు విడుదల చేసింది. ప్రైవేటీకరణలో భాగంగానే ట్రాన్సాక్షన్ అడ్వైజరీ కమిటీ, లీగల్ అడ్వైజరీ కమిటీ, ఆస్తుల మదింపు కమిటీలు వేసింది. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు దీనిపై గత రెండు సంవత్సరాలకు పైబడి పోరాటాలు, నిరసనలు ఉధృతం చేస్తున్నాయి. బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలబడుతున్నాయి. మొదటి నుండి స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్ల పెట్టుబడులు పెడితే...డివిడెండ్లు, పన్నుల రూపంలో ప్రభుత్వాలకు సుమారు రూ.50 వేల కోట్లు చెల్లించింది. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్‌కు రూ.5 వేల కోట్లు, సొంత గనులు కేటాయించాలని పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. ఇదే అదానీ, అంబానీ కంపెనీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరితే ఆగమేఘాల మీద ఆర్థిక సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తోంది. అలాంటిది దేశ సంపదను పెంచుతున్న ప్రభుత్వ రంగ పరిశ్రమైన స్టీల్‌ప్లాంట్ పట్ల ఎందుకు ఇలాంటి వైఖరి ప్రదర్శిస్తోంది. దీన్నిబట్టి బిజెపి కి దేశ ప్రయోజనాలు, ప్రజల ప్రయోజనాల పట్ల ఎంత చిత్తశుద్ధి వుందో అర్థమౌతుంది. దేశభక్తి అంటే ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మటమా? ఇటీవల కాలంలో స్థానిక స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఒక కొత్త జీవో విడుదల చేసింది. దీనిని ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త నాటకం మొదలెట్టింది. దీనిని ఆధారం చేసుకొని జిందాల్ కంపెనీ భాగస్వామి అయ్యేందుకు కుట్రలు పన్నుతోంది.



> కేంద్ర ప్రభుత్వం మొదటి నుండి స్టీల్‌ప్లాంట్ పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేయకుండా ఆటంకాలు సృష్టిస్తోంది. మూడవ బ్లాస్ట్ ఫర్నేస్ మూసివేసింది. ముడిసరుకు వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వటంలేదు. రైల్వే ర్యాకులను అడ్డుకుంటున్నది. సొంత గనులు ఇవ్వడంలేదు. స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బ తీసే చర్యలు చేపడుతున్నది. ఇన్ని కుట్రలు చేస్తుంటే స్టీల్‌ప్లాంట్‌కి లాభాలు ఎలా వస్తాయి?

కేంద్ర ప్రభుత్వం మొదటి నుండి స్టీల్‌ప్లాంట్ పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేయకుండా ఆటంకాలు సృష్టిస్తోంది. మూడవ బ్లాస్ట్ ఫర్నేస్ మూసివేసింది. ముడిసరుకు వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వటంలేదు. రైల్వే ర్యాకులను అడ్డుకుంటున్నది. సొంత గనులు ఇవ్వడంలేదు. స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బ తీసే చర్యలు చేపడుతున్నది. ఇన్ని కుట్రలు చేస్తుంటే స్టీల్‌ప్లాంట్‌కి లాభాలు ఎలా వస్తాయి? తడి గుడ్డతో గొంతు కొయ్యడమంటే ఇదే. ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లకు సొంతగనులు వున్నా మరలా వారికే గనులు కేటాయిస్తున్నారు. రబోద్‌లో స్టీల్‌ప్లాంట్‌కున్న బొగ్గు గనులను అర్థాంతరంగా రద్దు చేసి ప్రైవేట్‌వారికి అప్పగించారు. కాని ప్రభుత్వరంగ సంస్థ అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఎందుకు కేటాయించడం లేదు? ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వం అడ్డగోలుగా బ్యాంకులు, ఎల్‌ఐసి, రైల్వే, గనులు, ఎయిర్‌పోర్టులు, పోర్టులను తన అనుయాయులకు అమ్మకాలు జరుపుతోంది. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ వాటా వచ్చింది. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని నినదించి 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న మన విశాఖ ఉక్కుని రక్షించుకొనే బాధ్యత తెలుగు ప్రజలందరిపైన వుంది.

స్టీల్‌ప్లాంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండి ఉదాసీనంగా వుంది. అసెంబ్లీలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేసి చేతులు దులుపుకుంది. ఒకపక్క ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూనే వితండవాదం చేస్తోంది. ఇటీవల రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి... స్టీల్ బిడ్డింగ్‌లో పాల్గొనకూడదని, పాల్గొంటే ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరించటమే అని వక్రభాష్యం చెబుతున్నారు. మొదట్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏమని ప్రకటించారో ఒకసారి గుర్తు చేసుకోవాలి. గత రాష్ట్ర పరిశ్రమల శాఖామాత్యులు, కీర్తిశేషులు మేకపాటి గౌతమ్ రెడ్డి గారు అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం బిడ్డింగ్‌లోనైనా పాల్గొని స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని ప్రకటించగా...నేడు సజ్జల రామకృష్ణారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్ దానికి భిన్నంగా మాట్లాడుతున్నారు. ఒకపక్క స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని ప్రగల్భాలు పలుకుతూనే వాడచీపురుపల్లిలో ఉన్న శాండ్ మైన్స్ ఎందుకు రద్దు చేశారు? ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం స్టీల్‌ప్లాంట్ విషయంపై కేంద్రం ప్రభుత్వాన్ని పల్లెత్తుమాట కూడా అనడడంలేదు. జనసేన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడతామని చెబుతూనే బిజెపి పంచన చేరి ఇప్పుడు మాట్లాడడంలేదు. ఇటీవల బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లో ఇండోర్, బాగల్పూర్ ఎయిర్‌పోర్టులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించాలని చూస్తే ప్రజలందరూ ఐక్యంగా పోరాడడం వలన కేంద్రం వెనక్కి తగ్గింది. స్టీల్‌ప్లాంట్‌పై బిఆర్ఎస్ తీసుకున్న వైఖరిని మన రాష్ట్ర ప్రభుత్వం స్వాగతించాల్సింది పోయి ఎదురు దాడికి పూనుకుంటున్నది. దీన్నిబట్టి రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ప్రజలకు అర్థమౌతుంది. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం అఖిలపక్ష పార్టీలను తీసుకెళ్ళడానికి ఎందుకు చొరవ చూపడంలేదు? రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ప్రకటన చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధిలో స్టీల్‌ప్లాంట్ లేదా? రాష్ట్ర ప్రభుత్వ వైఖరి పట్ల రాష్ట్ర ప్రజలకు అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

కేంద్ర స్టీల్ విధానాన్ని పరిశీలిస్తే 2030 నాటికి 300 మిలియన్ మెట్రిక్ టన్నుల స్టీల్ అవసరం. నేడు 122 మిలియన్ మెట్రిక్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నది. మన స్టీల్‌ప్లాంట్ వాటా 7.3 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేయాలి. ఏనాడూ పూర్తిస్థాయి సామర్థ్యాల ఉత్పత్తికి నోచుకోకుండా కేంద్ర ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే విశాఖ స్టీల్‌ప్లాంట్ అవసరం ఏమిటో అర్థమౌతుంది. ఆంధ్ర రాష్ట్రం విడిపోయిన తరువాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ. కావున దేశ, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని, విశాల పోరాటాలకు మద్దతునివ్వాలని, తెలుగోడి పోరాటం తెగువ చూపాలని విజ్ఞప్తి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

పుల్వామా వైఫల్యానికి ప్రభుత్వానిదే బాధ్యత

- అది నివారించదగినదే
- జవాన్లను విమానంలో పంపాల్సింది
- పుల్వామా ఘటనపై మాజీ ఆర్మీ చీఫ్ శంకర్ రాయ్



న్యూఢిల్లీ : పుల్వామా ఘటన నివారించదగినదేనని భారత సైనిక దళాల మాజీ ప్రధానాధికారి జనరల్ శంకర్ రాయ్ చౌదరి అభిప్రాయపడ్డారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది శ్రీనగర్‌కు రోడ్డు మార్గం ద్వారా కాకుండా విమానంలో వెళ్లి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని ఆయన అన్నారు. రోడ్డు మార్గాలు ఎప్పుడూ దాడులకు అనుకూలంగానే ఉంటాయని చెప్పారు. రెండున్నర వేల మందితో 78 వాహనాలు హైవే మీద ప్రయాణించి ఉండాల్సింది కాదని శంకర్ రాయ్ తెలిపారు. పుల్వామాలో 40 మంది జవాన్లు చనిపోవడానికి ప్రధాని నేతృత్వంలోని ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఎందుకంటే ఆయన జాతీయ భద్రతా సలహాదారు కూడా అని చెప్పారు. ఇంటెలిజెన్స్ వైఫల్యానికి కూడా ప్రధానే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పుల్వామా ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ అప్పటి జమ్మూకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ గళం విప్పిన రెండు రోజుల తర్వాత సైనిక దళాల మాజీ ప్రధానాధికారి కూడా పెదవి విప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. జనరల్ రాయ్ చౌదరి 1994 నవంబర్ నుండి 1997 సెప్టెంబర్ వరకూ ఆర్మీ చీఫ్‌గా వ్యవహరించారు.

'సైనిక దళాలు భారీ కాన్వాయ్‌తో జాతీయ రహదారుల మీదుగా వెళ్లడం మంచిది కాదు. ఎందుకంటే ఆ మార్గాలు దాడులకు ఎప్పుడూ అనువుగా ఉంటాయి. పుల్వామాలో జమ్ము, శ్రీనగర్ మధ్య ఉన్న రహదారిపై ముజాహదీన్లు దాడి చేశారు. జవాన్లు రోడ్డు మార్గం మీదుగా కాకుండా విమానాలలో వెళ్లి ఉంటే ఈ దాడి జరిగి ఉండేది కాదు.' అని జనరల్ రాయ్ టెలిగ్రాఫ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. పైగా పుల్వామా ప్రాంతం దాడులకు అత్యంత అనువైన ప్రదేశమని సైన్యంలో 40 సంవత్సరాలు పనిచేసిన రాయ్ చెప్పారు. జమ్మూలోని సాంబా మీదుగా వెళ్లే రోడ్డులో ఉగ్రవాదుల చొరబాట్లు ఎక్కువగా జరుగుతుంటాయని గుర్తు చేశారు. అదీకాక ఆ సరిహద్దు ప్రాంతం పాకిస్తాన్‌కు ఎంతో దూరంలో లేదని చెప్పారు.

'నలభై మంది జవాన్లు అంటే పెద్ద సంఖ్యే. వారిని జమ్మూకాశ్మీర్‌లో మోహరించారు. ఈ దాడిని నూటికి నూరు శాతం ఇంటెలిజెన్స్ వైఫల్యంగానే గుర్తించాలి' అని జనరల్ రాయ్ అన్నారు. పుల్వామా ఘటనపై లేవనెత్తే ప్రశ్నలు జాతి వ్యతిరేకమంటూ బీజేపీ చేస్తున్న వాదనను ఆయన ప్రస్తావిస్తూ ప్రభుత్వం చేతులు కడిగేసుకోవాలని చూస్తోందని వ్యాఖ్యానించారు. జనరల్ రాయ్ గతంలో పరమ్ విశిష్ట్ సేవా పతకాన్ని కూడా పొందారు.

అసోం ఎమ్మెల్యేకు సుప్రీం బెయిల్

- 567 రోజుల జైలు జీవితం

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్ట (సీఏఏ) వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్నారనీ, మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ నమోదు చేసిన కేసులో అసోం స్వతంత్ర ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్‌కి సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. సీఏఏ వ్యతిరేక నిరసన సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారంటూ గొగోయ్‌పై కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఆయనపై అభియోగాల నమోదుకు ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును అనుమతిస్తూ ఫిబ్రవరి 9న అసోం హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. అయితే అంతకుముందు గొగోయ్, మరో ముగ్గురిపై నమోదు చేసిన కేసును ఎన్ఐఏ కోర్టు కొట్టివేసింది. వీరందరికీ క్లీన్‌చిట్ ఇచ్చింది. దీనిపై ఎన్ఐఏ కోర్టుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ అభియోగాల నమోదుకు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను గొగోయ్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు.

అంతకుముందు గొగోయ్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చడంతో ఆయన 567 రోజులు జైలులో గడిపారు. ఎన్ఐఏ కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చిన తర్వాతే ఆయన విడుదలయ్యారు. గొగోయ్‌పై నమోదైన రెండు కేసుల్లో ఒక దానిలో బెయిల్ వచ్చినా, రెండో కేసులో రాకపోవడంతో జైలులో గడపాల్సి వచ్చింది. కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడడం దేశ ఆర్థిక భద్రతకు ముప్పు కలిగించినట్లు కాదని, అది ఉగ్రవాద చర్య కూడా కానేరదని కోర్టు స్పష్టం చేసింది.

దభోల్కర్ హత్య కేసు విచారణపై పర్యవేక్షణ కొనసాగించం

- బాంబే హైకోర్టు

ముంబయి : హేతువాది నరేంద్ర దభోల్కర్ హత్య కేసుపై సిబిఐ నిర్వహిస్తున్న విచారణపై పర్యవేక్షణను కొనసాగించబోమని బాంబే హైకోర్టు మంగళవారం ప్రకటించింది. విచారణపై పర్యవేక్షణ కొనసాగించాలని దభోల్కర్ కుమార్తె ముక్తా దభోల్కర్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎఎస్ గడ్కారీ, జస్టిస్ పిడి నాయిక్‌తో కూడిన డివిజన్ బెంచ్ కొట్టి వేసింది. 2013 ఆగష్టు 20న పుణేలో ఉదయపు నడక చేస్తున్న దభోల్కర్ హిందుత్వ గూండాలు దారుణంగా కాల్చి చంపారు. ఈ కేసు విచారణను పుణే పోలీసుల నుంచి 2014లో సిబిఐకు అప్పగించిన హైకోర్టు అప్పటి నుంచి విచారణను పర్యవేక్షిస్తూ వచ్చింది.

పంజాబ్‌లో కదం తొక్కిన గోధుమ రైతులు

కేంద్ర నిర్ణయానికి నిరసనగా రైల్‌రోకో



అమృతసర్‌లోని రైళ్లను అడ్డుకున్న రైతులు

చండీఘర్ : పంజాబ్‌లో గోధుమ రైతులు కదం తొక్కారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పాడైపోయిన, ముక్కిపోయిన గోధుమలకు కేంద్రం ధర తగ్గించడాన్ని నిరసిస్తూ రైలు పట్టాలపై బైఠాయించారు. రైతుల ఆందోళన కారణంగా అనేక రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భారతీ కిసాన్ యూనియన్, బీకేయూ (లఖోవాల్) సహా ఏడు రైతు సంఘాలు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రైల్‌రోకో నిర్వహించాయి.

లూధియానా, అమృత్‌సర్, బఠిండా, ఫిరోజ్‌పూర్, సంగ్రూర్, ఫజిల్కా, గురుదాస్‌పూర్, తరన్‌తరన్ సహా పలు ప్రాంతాలలో రైళ్ల రాకపోకలను రైతులు అడ్డుకున్నారు. కొన్ని చోట్ల పట్టాలపై టెంట్లు కూడా వేశారు.

వర్షాల కారణంగా దెబ్బతిన్న గోధుమలను కొనుగోలు చేసే సమయంలో కేంద్రం ధరను తగ్గించడాన్ని నిరసిస్తూ రైల్‌రోకో చేపట్టామని బీకేయూ (ఏక్తా ఉగ్రహాణ్) ప్రధాన కార్యదర్శి సుఖ్‌దేవ్ సింగ్ కొక్రికలాన్ తెలిపారు. కేంద్ర నిర్ణయం రైతు వ్యతిరేకమని విమర్శించారు. సంక్షోభ సమయంలో రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం గోధుమల ధరను తగ్గించి కొనడం దారుణమని ఫిరోజ్‌పూర్‌లో ఓ రైతు సంఘం నేత ఆవేదన వ్యక్తం చేశారు. కాగా పంజాబ్, చండీఘర్, హర్యానా, రాజస్థాన్‌లో గోధుమ సేకరణకు సంబంధించి నాణ్యతా నిబంధనలను ప్రభుత్వం సడలించిందని, రైతుల ప్రయోజనాలు కాపాడటమే దీని ఉద్దేశమని ప్రభుత్వ అధికారి ఒకరు గత వారం తెలిపారు. చెడిపోయిన, ముక్కిపోయిన గోధుమల కొనుగోలుకు సంబంధించి ఆరు శాతం వరకూ ఎలాంటి ధర తగ్గింపు ఉండదని ప్రభుత్వం చెబుతోంది. వర్షాల కారణంగా దెబ్బతిన్న గోధుమల అమ్మకంలో రైతులకు జరిగే నష్టాన్ని తమ ప్రభుత్వం భరిస్తుందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ చెప్పారు.

మరోవారం ఇలాగే : ఐఎండి

న్యూఢిల్లీ : భానుడి ప్రతాపంతో యావత్ దేశం అల్లాడుతున్నది. పలు రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి.

కాగా, మరో వారం రోజుల పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఎండ తీవ్రతతోపాటు వేడిగాలులు వీస్తాయని తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. బీహార్, పశ్చిమ బెంగాల్‌లో రానున్న నాలుగు రోజుల పాటు వేడి గాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది. ఏప్రిల్ 18, 19 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో హీట్ వేవ్ పరిస్థితులు నెలకొంటాయని అంచనా వేసింది. ఇక సిక్కిం, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో రానున్న రెండు మూడు రోజులు వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొంది. దేశ రాజధాని ఢిల్లీలోనూ వేడిగాలులు వీస్తున్నాయి. కొన్ని వాతావరణ స్టేషన్లలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కనీసం ఐదు డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. పంజాబ్, హర్యానాలలో కూడా వేడి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. హర్యానాలో 41.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో వేడిగాలులు వ్యాపించాయి. రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని ఛండీగఢ్‌లో వేడి తీవ్రత అత్యధికంగా 40 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.



పశ్చిమబెంగాల్‌లోని కూచ్‌బెహార్‌లో ఎర్రజెండాలతో ప్రదర్శన

ఎర్రజెండాయే అండదండ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్ ప్రాంతంలో ప్రజలు మళ్లీ ఎర్రజెండా చేత పట్టి పోరుబాట పడుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్, బిజెపి హామీల గొప్పలకు మోసపోయి ఆ పార్టీల్లో చేరిన వీరంతా ఆ పార్టీలిచ్చిన హామీలు నీటి మీద రాతలనేని గ్రహించారు. రాష్ట్రంలో పెరిగిపోతున్న భారీ అవినీతి, బిజెపి మతోన్మాద రాజకీయాలు ప్రజా ఐక్యతను దెబ్బతీస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి లేక యువత అఘోరిస్తోందని తెలిపారు. కూచ్‌బెహార్‌కు చెందిన దాదాపు 400 కుటుంబాలు మంగళవారం నాడు ఎర్ర జెండా పట్టి ఉద్యమబాట పట్టారు. అవినీతి, నిరుద్యోగం ఇతర సమస్యలను పరిష్కరించేది వామపక్షాలు మాత్రమేనంటూ నినదించారు. భారీ ర్యాలీ చేపట్టి బిజెపి, తృణమూల్ కాంగ్రెస్ పాలనాతీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎల్లప్పుడూ అండదండగా నిలుస్తూవస్తున్న ఎర్రజెండాయేనని, అందుకే మళ్లీ ఎర్రజెండా చేబూనామని వారు తెలిపారు.

ఎన్‌సిపిలోనే ఉన్నా.. వదంతులు నమ్మొద్దు

- సీనియర్ నేత అజిత్ పవార్

ముంబయి : ఎన్‌సిపి నుంచి కొందరు ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకొని ఒక ముఠాగా బిజెపిలోకి పిరాయించనున్నట్లు వచ్చిన వార్తలను ఎన్‌సిపి సీనియర్ నేత అజిత్ పవార్ తీవ్రంగా ఖండించారు. ఇవన్ని తప్పుడు ఊహాగానాలని ఆయన కొట్టిపారేశారు. ఎన్‌సిపి అనేది ఒక కుటుంబమని, పార్టీ అధ్యక్షులు శరద్ పవార్ నాయకత్వంలో పని చేస్తూనే ఉంటుందని తెలిపారు. ముంబయిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు. తాను ఎన్‌సిపిని చీల్చి అధికార బిజెపి-శివసేన (ఏక్‌నాథ్ షిండే) కూటమిలో చేరతానని వస్తున్న వార్తాలను నమ్మవద్దని, అవన్నీ వదంతులని ఆయన స్పష్టం చేశారు.

వందే భారత్ రైళ్ల కోసం రష్యాతో ఒప్పందం

న్యూఢిల్లీ : అతివేగంగా నడుస్తున్న వందే భారత్ రైళ్ల కోసం రష్యాతో భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు రష్యా వార్త సంస్థ టాస్ (టిఎఎస్ఎస్) తాజాగా వెల్లడించింది. 120 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఉత్పత్తి, సరఫరా, నిర్వహణ కోసం రష్యాకు చెందిన ట్రాన్స్‌మాష్‌హోల్డింగ్ (టిఎంహెచ్)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ వార్తా సంస్థ పేర్కొంది. బహుశా ఈ ఏడాది జూన్ 1 నాటికి వందే భారత్ రైళ్ల ఒప్పందాన్ని భారత్ కుదుర్చుకునే అవకాశముందని మీడియా వర్గాలు పేర్కొన్నాయి. వందే భారత్ రైళ్లను సరఫరా చేసేందుకు గాను 1.8 బిలియన్ డాలర్లను భారతీయ రైల్వే రష్యాకు చెల్లించనుంది. ఇక 35 సంవత్సరాల రైళ్ల నిర్వహణ కోసం మరో 2.5 బిలియన్ డాలర్లను మొత్తం ఈ రైళ్ల కోసం 6.5 బిలియన్ డాలర్ల మేర భారత్ ఒప్పందం చేసుకోనున్నట్లు రష్యా వార్త సంస్థ పేర్కొంది. కాగా, 'వందే భారత్ రైళ్ల కోసం నిర్ణయం తీసుకోబడింది. కానీ దీనికి సంబంధించిన ఒప్పందంపై సంతకం చేయలేదు.

బిఎల్ ఎక్కడికెళ్లినా బిజెపికి ఓటమే

- సంతోష్‌పై నిప్పులు చెరిగిన శెట్టర్
- అవమానాలు భరించలేకే కాంగ్రెస్‌లోకి





బెంగళూరు : బిజెపి వీడి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ మంగళవారం నాడు మరోమారు కాషాయ పార్టీపై విరుచుకుపడ్డారు. బిజెపి ప్రధానకార్యదర్శి బిఎల్ సంతోష్‌పై ఆయన నిప్పులు చెరిగారు. తాను రాజకీయంగా ఎదగడం ఇష్టం లేక..సంతోషే కుట్రపూరితంగానే తనకు టిక్కెట్ రానీయకుండా అడ్డుకున్నారని, ఘోరంగా అవమానించారని శెట్టర్ అన్నారు. బిఎల్ సంతోష్ ఎక్కడికెళ్లినా అక్కడల్లా బిజెపి ఓటమి తథ్యమని ఆయన పేర్కొన్నారు. బిజెపి ఎన్నికల ఇన్‌చార్జ్‌గా బిఎల్‌ను నియమించిన ప్రతి చోటా బిజెపి ఘోరంగా ఓడిపోయిందన్నారు. అయినా బిజెపి అగ్ర నాయకులు ఆయన్ను ఎందుకు నమ్ముతున్నారో అర్థం కావడం లేదన్నారు. సంతోష్‌కు పార్టీ కంటే వ్యక్తులు ముఖ్యమన్నారు. 'బిఎల్ సంతోష్‌ను కేరళ ఇన్‌ఛార్జ్‌గా నియమించినా రాష్ట్రంలో ఒక్క సీటు కూడా గెలవలేదు. తమిళనాడు ఇన్‌ఛార్జ్‌గా చేసినా..కొన్ని సీట్లు తప్ప అక్కడా ఒరిగిందేమీ లేదు. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు కూడా ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. అక్కడ పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇన్ని రాష్ట్రాల్లో ఘోరంగా విఫలమైన వ్యక్తి పార్టీలో నెంబర్ వన్, నెంబర్ టూ (ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా) స్థానంలో ఉన్న వారికి సలహాలు ఇస్తున్నాడు' అని శెట్టర్ ఎద్దేవా చేశారు. బిజెపిలో ఘోర అవమానాలను భరించలేక తాను కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. సొంత నియోజకవర్గమైన హుబ్లీ-ధార్వాడ నుంచి బిజెపి ఆయనకు టికెట్ నిరాకరించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన ఎఐసిసి అధినేత మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శెట్టర్ తరహాలోనే మైసూరు జిల్లా కష్ణరాజ అసెంబ్లీ స్థానం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఎస్ఎ రామదాస్‌ను కాదని కొత్త ముఖమైన శ్రీవాత్సకు బిజెపి టికెట్ ఇచ్చింది. దీనిపైనా శెట్టర్ ఘాటుగా స్పందించారు. 'రామదాస్ పరిస్థితి ఏమైందో చూడండి.. బిఎల్ సంతోష్ విధేయుడు కాదనే కారణంతో ఆయన్ను కూడా పక్కకు పెట్టేశారు. తన మాట వినే శ్రీవాస్తకు టిక్కెట్ ఇచ్చారు' అని అన్నారు.

అతిక్ న్యాయవాది నివాసం సమీపంలో బాంబు పేలుడు

ప్రయాగ్ రాజ్ : పోలీసు కస్టడీలోనే ఉండగానే దారుణ హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు అతిక్ అహ్మద్ న్యాయవాదుల్లో ఒకరి ఇంటి వద్ద మంగళవారం నాటు బాంబు పేలుడు ఘటన సంచలనంగా మారింది. ప్రయాగ్ రాజ్‌లోని కాత్రాలోని గోబర్ గాలి ప్రాంతంలో బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఎవ్వరూ గాయపడలేదని, రెండు గ్రూపుల మధ్య ఘర్షణల కారణంగానే బాంబు పేలుడు జరిగిందని ప్రయాగ్ రాజ్ పోలీసులు చెప్పారు.

రహస్య లేఖ..

ఏదైనా దుర్ఘటన జరిగితే లేదా తాను హత్యకు గురైతే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు అందజేయాలని కోరుతూ అతిక్ ముందుగానే ఒక లేఖను సిద్ధం చేసినట్లు మంగళవారం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ లేఖ రహస్యంగా ఉంచినట్లు తెలిసింది. ఈ విషయాన్ని అతిక్ న్యాయవాది విజయ్ మిశ్రా మీడియాకు తెలిపారు. 'సీల్డ్ కవర్‌లో ఆ లేఖ ఉంది. ఆ లేఖ ప్రస్తుతం నా వద్ద లేదు' అని న్యాయవాది తెలిపారు.

పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలి

- పలు దేశాల కమ్యూనిస్టు పార్టీల డిమాండ్

కారకస్ : పాలస్తీనా రాజకీయ ఖైదీలకు, అంతర్జాతీయ పోరాటయోధులకు స్వేచ్ఛ కల్పించాలని వెనిజులా, లెబనాన్, పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీలు, దక్షిణ అమెరికా కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలు, సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థలు కోరాయి. ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సోమవారం రాజకీయ ఖైదీల అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా రాజకీయ ఖైదీలకు, పాలస్తీనియన్ల ప్రయోజనాల కోసం పోరాడుతున్న అంతర్జాతీయ యోధులకు తమ పూర్తి సంఘీభావం వుంటుందని ఆ పార్టీలు పేర్కొన్నాయి. యూదుల ఆక్రమణ విధానాన్ని వ్యతిరేకించినందుకు అక్రమంగా నిర్బంధించిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరాయి. మానవ హక్కులను గౌరవించాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించాయి. అలాగే పాలస్తీనా కోసం పోరాడుతూ గత 39 ఏళ్ళుగా స్వేచ్ఛ లేకుండా మగ్గుతున్న లెబనాన్ జాతీయుడు జార్జి ఇబ్రహీం అబ్దుల్లాను, ఫ్రెంచి జైళ్ళలోమగ్గుతున్న వెనిజులా జాతీయుడు ఇలిచ్ రమిరెజ్ సాంచెజ్‌ను కూడా విడుదల చేయాలని ఆ ప్రకటన కోరింది. ఇజ్రాయిల్ యూదు ప్రభుత్వ ఊచకోత విధానాన్ని కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా ఖండించాయి. యూదుల ఆక్రమణలకు వ్యతిరేకంగా చట్టబద్ధంగా పోరాటం చేస్తున్న పాలస్తీనియన్లకు సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించాయి.

ఆదివాసీల నుంచి పాఠాలు నేర్చుకుందాం


- వాతావరణ సంక్షోభ నివారణకు గుటెరస్ పిలుపు




ఐక్యరాజ్య సమితి : వాతావరణ సంక్షోభాన్ని నివారించడానికి ఆదివాసీల వద్ద అనేక పరిష్కారాలు వున్నాయని, వారి నుండి ప్రపంచం ఎంతో నేర్చుకోవాల్సి వుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ సోమవారం వ్యాఖ్యానించారు. ఆదివాసీల సమస్యలపై ఐక్యరాజ్య సమితి శాశ్వత వేదిక 22వ సమావేశాలను ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సవాళ్ళను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. మొత్తంగా ప్రపంచ జనాభాలో ఆదివాసీలు దాదాపు 5 శాతం మంది వుంటారు. కానీ ప్రపంచంలోని అత్యంత పేదల్లో 15 శాతం మంది వారిలోనే వున్నారని అన్నారు. వాతావరణానికి సంబంధించిన అత్యవసర పరిస్థితుల్లో వారు జీవిస్తున్నారన్నారు. వాతావరణ సంక్షోభానికి వారు కారణం కాకపోయినా అత్యంత అధ్వాన్నమైన, తక్షణమే ప్రభావం చూపగల ప్రభావాలను వారు ఎదుర్కొంటున్నారని అన్నారు. "ఐక్యరాజ్య సమితి ఆదివాసీలకు బాసటగా వుంటుంది." అన్నదే ఈనాటి తన సందేశమని గుటెరస్ స్పష్టం చేశారు. 2000లో ఐక్యరాజ్య సమితి శాశ్వత వేదిక ఏర్పడింది. ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సామాజిక మండలి(ఇసిఓఎస్‌ఓసి) ద్వారా ఐక్యరాజ్య సమితి వ్యవస్థకు ఆదివాసీల సమస్యలపై సూచనలు, సలహాలను ఈ ఫోరం అందచేస్తుంది. ఈ నెల 28వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. "ఆదివాసీలు, మానవ ఆరోగ్యం, భూగోళం, ప్రాదేశిక ఆరోగ్యం, వాతావరణ మార్పులు : హక్కుల ఆధారిత విధానం" అన్న అంశం ప్రాతిపదికగా ఈ ఏడాది సమావేశాలు జరుగుతున్నాయి.



తెలుగు 'చిత్ర'పటంపై చెరగని సంతకం!



గర్వం వద్దు




హరితారణ్యంలో ఓ చింత చెట్టు ఎంతోకాలంగా నివసిస్తుండేది. దాంతో పాటు మామిడి, నేరేడు చెట్లు కూడా ఉండేవి. చింత చెట్టు ఎల్లప్పుడూ తన బలమైన కొమ్మలు, భూమిలోకి గుబురుగా విస్తరించిన వేర్లను చూసుకుని ఎంతో గర్వపడ్తూ ఉండేది. గర్వంతో నేరేడు, మామిడి చెట్లను ఎంతమాట పడితే అంతమాటనేది. ప్రతి ఏటా వచ్చే గాలివానకు మామిడి, నేరేడు చెట్టు కొమ్మలు విరిగి పడిపోతూ ఉంటేవి. ఎంత పెద్ద గాలికైనా చింత చెట్టు తొణకకుండా స్థిరంగా ఉండేది. ఆ వనానికి తానే రారాజునని భావించేది. గాలివానకు బయపడే మిగిలిన చెట్లను చూసి నవ్వేది. చింతచెట్టు వైఖరికి ఆ చెట్లు ఎంతో బాధపడేవి.

ఒకరోజు అనుకోకుండా పెద్ద తుఫాను వచ్చింది. భూమి ఉపరితలం నుంచి బలమైన గాలులు వీచసాగాయి. తక్కువ ఎత్తులో ఉన్న చెట్లను గాలులు తాకలేదు. చింతచెట్టు ఎన్నో సంవత్సరాలు ఏపుగా ఎదిగి ఆకాశంలోకి విస్తరించిన కారణంగా పై భాగంలోని కొమ్మలు ఊగిపోయాయి. దాంతో తన బలాన్నంతా ఉపయోగించి గాలులను ఎదురిస్తూ నిలబడింది. భూమి లోపలికి విస్తరించిన తన వేళ్లను గట్టిగా అదిమి పట్టి ఉంచింది. కానీ నిర్విరామంగా వీస్తున్న గాలికెరటాలను ఎక్కువ సేపు ఎదుర్కోలేక పోయింది. పట్టుసడలి చింతచెట్టు వేళ్లతో సహా నెమ్మదిగా నేలకొరగసాగింది.. ఆ సమయంలో దానికి నేరేడు, మామిడి చెట్లు గుర్తు వచ్చాయి. వాటిని అవమానించినందుకు చింతించింది. గర్వంతో ఇతరులను హేళన చేయకూడదని తెలుసుకుంది. తప్పు తెలుసుకుని క్షమించమని కోరి నేలకొరిగిపోయింది.

- గేరపాటి భానువర్ధన్
81065 86997

తేడాలు గుర్తించండి

పిల్లలూ!
ఈ చిత్రంలో
ఏడు తేడాలు
ఉన్నాయి. అవి ఏంటో
గుర్తించండి.



నేను గీసిన బొమ్మ






- సి. ధరణి,
3 వ తరగతి,
పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల,
తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఐదు దశాబ్దాలుగా తెలుగు పత్రికలను, పుస్తకాలను తన అందమైన రేఖాచిత్రాలతో సౌందర్యవంతం చేసిన చిత్రకారుడు బాలి. ఆయన అసలు పేరు మేడిశెట్టి శంకరరావు. దేశవిదేశాల్లోని తెలుగువాళ్లకు, గీతల్ని, రాతల్ని ప్రేమించేవారికీ బాలిగానే ఆయన సుపరిచితం. లక్షల చిత్రాలు గీసిన లక్షణమైన చిత్రకారునిగా, కార్టూనిస్టుగా, కథారచయితగా తన జీవితాన్నే చిత్రంగా మలచుకున్న కళాకారుడు బాలి. విద్యార్థి దశలోనే 1958 నాటి ఆంధ్ర (వార) పత్రికలో 'ఉబుసుపోక' అనే శీర్షికతో వేసింది తొలి చిత్రమైనా, 1970 నుంచే విస్తారంగా చిత్రాలు గీస్తున్నారు. అమ్మ అన్నపూర్ణమ్మ అందంగా తీర్చిదిద్దే ముగ్గుల్ని చూసి చిత్రకళా సాధనకు ఉపక్రమించిన 'బాలి' ఏ గురువు దగ్గరా శిక్షణ పొందకుండానే స్వయంకృషితో ఎదిగారు.

బాలి స్వస్థలం విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి. అమ్మ అన్నపూర్ణమ్మ, నాన్న లక్ష్మణరావు. అప్పటి బ్రిటీష్ పాలనలో ఆర్మీలో తండ్రి సుబేదార్‌గా ఉండేవారు. ఉద్యోగరీత్యా సింగపూర్, ఇటలీ, మలయా తదితర దేశాలు తిరిగేవారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో అమ్మే ధైర్యం చెప్పేది. తండ్రి మరణంతో అనకాపల్లిలోని మామయ్య ఇంటికి చేరారు. అక్కడే బాలి చదువు మొదలయ్యింది. బాలి తండ్రి కూడా చిత్రకారుడే! ఆయన చనిపోయిన తర్వాత కానీ, ఆ విషయం తెలియదు ఇంట్లో వారికి. తండ్రికి సంబంధించిన పెట్టెల్ని బ్రిటీష్ అధికారులు పంపితే- పన్నెండేళ్ల తర్వాత తెరిచి చూస్తే డబ్బు, ఇతర వస్తువులతోపాటు, బొమ్మలేయడానికి ఉపయోగించే చైనా రంగుల కేకులు, కుంచెలు, ఆయన చిత్రించిన ప్రకృతి దృశ్యాలూ కన్పించాయి. ఈ ల్యాండ్‌స్కేప్‌లు బాలిలో చిత్రకారుడికి బీజం వేశాయి.

తల్లి అన్నపూర్ణమ్మ ఎంతో అందంగా ముగ్గుల్ని తీర్చిదిద్దడాన్ని బాలి చిన్నప్పటి నుంచీ మక్కువతో చూసేవాడు. అదే తన చిత్రకళకు ప్రేరణ అనేవారు ఆయన. "నేను వేసిన బొమ్మల్ని మా టీచర్లు అంతగా మెచ్చుకోకపోయినా అమ్మ మాత్రం వాటిలో లోపాలను సరిద్దుతూ మురిపెంగా చూసేది. అమ్మ పడుకున్నప్పుడు వెనుకనుంచి చూసి ఆ భంగిమనే చిత్రంగా గీశాను. ఇప్పటికీ మహిళల చిత్రాలు గీసేటప్పుడు నాకు తెలియకుండానే అమ్మ గుర్తొచ్చి, ఆ ప్రభావం చిత్రాల్లో కన్పిస్తుంటుంది." అని గతంలో ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు బాలి.



"చదువుతో పాటు చిత్రకళాభ్యాసం చేస్తూనే ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. కుటుంబ పోషణకు ఉద్యోగాల వేట మొదలుపెట్టాను. ఆ సమయంలో చిత్రకళా సాధనని కొంచెం పక్కన పెట్టాను. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి, పబ్లిక్ వర్క్స్ విభాగంలో క్లర్క్ ఉద్యోగంలో చేరాను. అయితే బొమ్మలు గీయడం ప్రాక్టీస్ మళ్లీ ఎక్కువైంది. పత్రికల్లోనూ నేను గీసిన చిత్రాలు వస్తుండేవి. 1970లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఒక పిల్లల నవల రాసి, దానికి బొమ్మలు కూడా నేనే గీసి పంపించాను. అప్పటి ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్యశర్మ దానిని పత్రికలో సీరియల్‌గా ప్రచురించడమే కాకుండా.. తనను కలవాల్సిందిగా కబురుపెట్టారు. అక్కడ కెరీర్ బాగుంటుందని భావించి, ప్రభుత్వోద్యోగాన్ని వదిలేశాను.

ఆంధ్రజ్యోతి వారపత్రిక, యువ, జ్యోతి మాసపత్రికల్లో రకరకాల కథలకు నా చిత్రాలు ఎక్కువగా వచ్చేవి. అయితే వృత్తిలో మాత్రం స్థిరపడలేదు. ఈలోగా ఈనాడు పత్రిక ప్రారంభమై, అందులో నన్ను స్టాఫ్ ఆర్టిస్టు/ కార్టూనిస్టుగా తీసుకున్నారు. అయితే, ఏడాదిన్నరకే బయటకు వచ్చేశాను. వెంటనే ఆంధ్రజ్యోతిలో స్టాఫ్ ఆర్టిస్టుగా అప్పటి ప్రధాన సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు తీసుకున్నారు. ఆ సంస్థలో 12 ఏళ్లు పనిచేశాను.


బొమ్మలు గీసే మొదట్లో దిగువన శంకర్, శంకరరావు అని సంతకం పెట్టేవాడిని. అయితే అప్పటికే బొమ్మలు గీస్తున్న శంకర్‌లు ఇద్దరున్నారు. దాంతో పురాణం సుబ్రహ్మణ్యశర్మ నాకు 'బాలి' అని నామకరణం చేశారు. నాకూ అది వినూత్నంగా, వైవిధ్యంగా అన్పించింది. అప్పట్నుంచీ నా చిత్రాలకు 'బాలి' అనే పేరే స్థిరపడిపోయింది. నా అసలుపేరు కన్నా ఈ పేరే నన్ను ఎక్కువ ప్రాచుర్యంలో ఉంచుతోంది."

"కార్టూన్‌ని ఏ అంశంపై గీయాలో ముందుగా అవగాహన చేసుకుంటాను. నిజానికి బొమ్మ గీయడం, అందులో యాక్షన్ నాకు కొత్తకాదు. దాన్లో ఫన్ పేల్చడంలోనే కష్టమంతా ఉంటుంది. కార్టూన్‌లో రాసిన మాటలు చక్కగా అందరూ చదివి, ఆహ్లాదంగా నవ్వుకునేలా ఉండాలి. ఇదంతా కొంత వ్యవధిలోనే జరిగిపోవాలి. అలాంటి అంశాలన్నీ దృష్టిలో పెట్టుకుని, కార్టూన్లు పుంఖానుపుంఖాలుగా వేశాను. వాటిలో పోయినవి పోగా ఇప్పటికే ఆరేడు కార్టూన్ సంపుటాలు వచ్చాయి."


బాలి మంచి కథా రచయిత. చాలా సూక్ష్మమైన పరిశీలతో జీవితాన్ని వడపోసిన కథలు 35 వరకూ రాశారు. అవి ఇటీవల కథల సంపుటిగా వెలువడ్డాయి. అలాగే తన ఆత్మకథను 'చిత్రమైన జీవితం' పేరిట రాసుకున్నారు.

బాపు మెచ్చుకున్న సందర్భం

వంగూరి ఫౌండేషన్ అమెరికా వారు 'బాలి కార్టూన్లు' అచ్చేశారు. దాన్ని హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో బాపు చేత ఆవిష్కరింపజేశారు.



కాలేజీ రోజుల్లో బాలి



ఆయన ఆ పుస్తకాన్ని అలవోకగా అటూ ఇటూ తిరగేస్తుంటే బాలి 'దాన్ని కొంచెం ఓపిగ్గా ఒకసారి చూడండి సార్!' అన్నారు. దానికి ఆయన 'బాలీ! మీకు తెలియకపోవచ్చు, నేను మీ బొమ్మల అభిమానిని. ఇదే కాదు కడప రెడ్డిగారి 'కాళిదాస శృంగార తిలకం' పుస్తకానికి మీరేసిన బొమ్మలు అద్భుతం' అన్నారు. ఆ కాంప్లిమెంట్‌కు బాలి ఎంతో సంతోషపడ్డారు.

తన మీద ఏ చిత్రకారుడి ప్రభావమూ లేదని బాలి చెప్పేవారు. "నేను ఎవర్నీ అనుకరించను. తెలుగులో బాపు దగ్గర్నుంచీ తమిళ, బెంగాలీ ఆర్టిస్టుల బొమ్మలన్నింటినీ గమనించేవాణ్ణి. ఇటు ఇండియన్, అటు ఫారిన్ ఆర్టిస్టుల్లో ఎవరి ప్రత్యేకతలు వారికున్నాయి. నా వరకు నేనైతే ఒక సంఘటనని తీసుకోవడం, దానిని చిత్రంగా మలచుకోవడం.. నా అనుభవం మీదే ప్రాక్టీస్ చేశాను. అప్పటికప్పుడు కొన్ని వివరాలు, విశేషాలు వెంటనే తట్టవు కనుక.. వాటికి సంబంధించిన ఫొటోలను భద్రపర్చుకుని, ప్రాక్టీస్‌లో ఉపయోగిస్తాను." అని ఒకసారి చెప్పారు.

బాలి బొమ్మల ప్రదర్శనలు చాలాచోట్ల జరిగాయి. అందుకున్న ప్రశంసలూ, సన్మానాలూ, అవార్డులూ చాలానే ఉన్నాయి. గుంటూరు కళాపీఠం 'చిత్రకళా సామ్రాట్' అనే బిరుదిచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'హంస' పురస్కారాన్ని అందించింది. న్యూజిల్యాండ్ బైబిల్ సొసైటీ ఆయన బొమ్మలకు ప్రత్యేక ప్రశంసలందించింది. జర్మనీ ఫ్రాంక్‌ఫర్ట్‌లో పర్యావరణంపై బాలి బొమ్మల పుస్తకాన్ని ముద్రించి ఆవిష్కరించారు. ... ఇలా ఎన్నో ఉన్నాయి. బాలి భౌతికంగా లేకపోవొచ్చు. ఆయన గీసిన చిత్రాలూ, రాసిన కథలూ తెలుగు సాహిత్య వాకిలిలో ప్రతినిత్యం శోభిస్తూనే ఉంటాయి.

బాలి గారి కుటుంబం

చిత్రకారుడు బాలి జీవన సహచరి ధనలక్ష్మి 2010లో చనిపోయారు. ఆమె లేని లోటు బాలిని తీవ్రంగా వేధించింది. బాలి తన పనిలో తాను ఉంటే ఇంటి విషయాలన్నీ ఆమె చక్కబెట్టుకునేవారు. "చిత్రకళలోనే కాకుండా ఎన్నో విషయాల్లో నా భార్య ధనలక్ష్మి సహకరించేది. నేను ప్రభుత్వోద్యోగం వదిలి పత్రికల్లోకి వెళ్తున్నానంటే ఏమాత్రం వెనక్కి లాక్కుండా, భవిష్యత్ గురించి భయపెట్టకుండా నాకు ఎంతో అండగా నిలిచింది. ఆమె నాకు దూరం కావడం నేను తేరుకోలేని విషాదమే." అని గుర్తు చేసుకునేవారు బాలి.

బాలి దంపతులకు ఇద్దరు పిల్లలు.. అమ్మాయి వైశాలి, అబ్బాయి గోకుల్. ఇద్దరూ ఉద్యోగాల రీత్యా అమెరికాలో ఉన్నారు. అయితే, కొద్ది నెలల క్రితం గోకుల్ నదీ ప్రమాదంలో తోటి వారిని రక్షించబోయి మృతి చెందాడు. ఈ సంఘటన బాలిని తీవ్రంగా కలిచివేసింది. మానసికంగా బాగా కృంగిపోయారు.

అంతర్యుద్ధంగా మారిన ఆధిపత్యపోరు

- 200 మందికి పైగా మృతి
- 1800 మందికి గాయాలు
- తక్షణ చర్చలకు గుటెరస్ పిలుపు

ఖార్టూమ్ : సూడాన్ సైన్యం, పారా మిలటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్‌ఎస్‌ఎఫ్) మధ్య తలెత్తిన ఆధిపత్య పోరు అంతర్యుద్ధంగా మారింది. సైన్యంలోని రెండు విభాగాల మధ్య తలెత్తిన ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు 200 మందికి పైగా చనిపోయారు, మరో 1800 మంది గాయపడ్డారు. కాగా ఈ ఘర్షణలు తగ్గే సూచనలు ఎక్కడా కనిపించడం లేదు. సూడాన్‌లో ఐక్యరాజ్య సమితి మిషన్ అధికారి వోల్కర్ పెర్తెస్ భద్రతా మండలికి సూడాన్‌లో నెలకొన్న ఉద్రిక్తతల గురించి తెలియచేశారు. సూడాన్ ఘర్షణలపై తాజా పరిస్థితులను తెలుసుకునేందుకు భద్రతా మండలి సమావేశమైంది. "పరిస్థితులు అస్సలు నిలకడగా లేవు. ఏ సమయంలో ఎవరు ఎటువైపు మొగ్గు చూపుతారో చెప్పడం కూడా కష్టంగానే వుంది." అని పెర్తెస్ సమావేశానంతరం విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు. తక్షణమే ఘర్షణలను విడనాడి, సంక్షోభ పరిష్కారానికి చర్చలు జరపాల్సిందిగా సోమవారం ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ సూడాన్ సైనిక బలగాల, ఆర్‌ఎస్‌ఎఫ్ నేతలకు విజ్ఞప్తి చేశారు. కానీ ఉభయ పక్షాలు చర్చలకు సుముఖంగా లేవని సూడాన్‌లో ఐక్యరాజ్య సమితి దూత వ్యాఖ్యానించారు. సైన్యం జనరల్ కమాండ్ కార్యాలయం వద్ద, ఖార్టూమ్‌లో ఆర్‌ఎస్‌ఎఫ్‌తో పరిమితంగానే ఘర్షణలు జరిగాయని సైన్యం సోమవారం తెలిపింది. అన్ని ప్రధాన కార్యలయాలు సైన్యం అధీనంలోనే వున్నాయని శత్రువు స్వాధీనం చేసుకుందనివస్తున్న వార్తలు అవాస్తవమని సైన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. రాజధానిలో ఆర్‌ఎస్‌ఎఫ్ స్థావరాలను అంతమొందించే లక్ష్యంతో అనేక లక్ష్యాలపై సూడాన్ వైమానిక బలగాలు దాడులు జరిపాయని సైన్యం తెలిపింది. కాగా, ఆర్‌ఎస్‌ఎఫ్ కమాండర్ మహ్మద్ హమ్‌దన్ డాగలో మాట్లాడుతూ, తక్షణమే సూడాన్ సైనిక కమాండర్ నేరాలను నిలువరించేందుకు అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని కోరారు. అమాయకులపై బాంబు దాడులు జరుపుతూ సైన్యం దారుణమైన యుద్ధం చేస్తోందని ఆయన విమర్శించారు. తమ బలగాలే ముందుగా సైన్యంతో పోరాటం ప్రారంభించాయనడాన్ని ఆయన తిరస్కరించారు. తాము ఎవరిపైనా దాడి చేయలేదన్నారు. సైన్యం ముట్టడికి ప్రతిస్పందనగా మాత్రమే తాము వ్యవహరించామని చెప్పారు. కాగా ఈ ఘర్షణలతో దేశవ్యాప్తంగా పరిస్థితులు క్షీణిస్తున్నాయి. ఆస్పత్రులపై, నీరు, విద్యుత్ సదుపాయాలపై దాడులు జరిగినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని ఐక్యరాజ్య సమితి ఎమర్జన్సీ రిలీఫ్ కోఆర్డినేటర్ మార్టిన్ గ్రిఫిత్ వ్యాఖ్యానించారు. ఈ పోరాటాన్ని ఆందోళనతో గమనిస్తున్నామని ఇజ్రాయిల్ పేర్కొంది.

గ్రీన్ మెరుపులు

సన్‌రైజర్స్‌పై 14పరుగుల తేడాతో ముంబయి గెలుపు



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కేమరూన్ గ్రీన్ (64 నాటౌట్)

హైదరాబాద్: రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ జట్టు 13 పరుగుల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 192పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 19.5ఓవర్లలో 178పరుగులకు కుప్పకూలింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయికి శుభారంభం లభించింది. కెప్టెన్ రోహిత్ శర్మ(28) జట్టు స్కోర్ 41పరుగుల వద్ద ఔటయ్యాడు. ఆ తర్వాత ఇషాన్, గ్రీన్ కలిసి 2వ వికెట్‌కు 46పరుగులు జతచేశారు. ధాటిగా ఆడే క్రమంలో ఇషాన్ కిషన్(38; 31బంతుల్లో 3ఫోర్లు 2సిక్సర్లు) ఔటైనా.. గ్రీన్(64నాటౌట్; 40బంతుల్లో 6ఫోర్లు 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. సూర్యకుమార్ యాదవ్(7) మరోసారి నిరాశపరిచినా.. తిలక్ వర్మ(37; 17బంతుల్లో 2ఫోర్లు, 4సిక్సర్లు) ధాటిగా ఆడాడు. చివర్లో టిమ్ డేవిడ్(16; 11 బంతుల్లో 2ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. జెన్సెన్‌కు రెండు, భువనేశ్వర్, నటరాజన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో సన్‌రైజర్స్‌కు ఓపెనర్ బ్రూక్(9) నిరాశపరిచినా.. మయాంక్ అగర్వాల్(48) బ్యాటింగ్‌లో రాణించాడు. ఆ తర్వాత క్లాసెన్(36), కెప్టెన్ మార్క్రమ్(22) మాత్రమే బ్యాటింగ్‌లో మెరిసారు. త్రిపాఠి(7), అభిషేక్ శర్మ(1), అబ్దుల్ సమద్(9) నిరాశపరిచారు. దీంతో సన్‌రైజర్స్ 19.5 ఓవర్లలోనే ఆలౌటైంది. ముంబయి బౌలర్లు బెహ్రెన్‌డార్ఫ్, మెరిడిత్, చావ్లాకు రెండేసి, అర్జున్ టెండూల్కర్, గ్రీన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కేమరూన్ గ్రీన్‌కు లభించింది.

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	5	4	1	8	+1.45
లక్నో	5	3	2	6	+0.76
చెన్నై	5	3	2	6	+0.26
గుజరాత్	5	3	2	6	+0.19
పంజాబ్	5	3	2	6	-0.10
ముంబయి	5	3	2	6	-0.16
కోల్‌కతా	5	2	3	4	+0.32
బెంగళూరు	5	2	3	4	-0.31
హైదరాబాద్	5	2	3	4	-0.79
ఢిల్లీ	5	0	5	0	-1.48

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

రోహిత్ @ 6వేల పరుగులు

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ రోహిత్ శర్మ ఐపిఎల్‌ల్లో 6వేల పరుగులను పూర్తి చేసుకున్నాడు. మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్‌ను అందుకున్నాడు. దీంతో ఐపిఎల్‌లో 6వేల పరుగులను కొట్టిన నాల్గో బ్యాటర్‌గా రోహిత్ నిలిచాడు. రోహిత్ శర్మ 227 ఇన్నింగ్స్‌లో 6వేల మార్క్‌ను అందుకున్నాడు. ఇక వార్నర్(165 ఇన్నింగ్స్), కోహ్లి(188ఇన్నింగ్స్), ధావన్(199 ఇన్నింగ్స్) రోహిత్ శర్మకంటే ముందే 6వేల పరుగుల మార్క్‌ను సాధించారు.

విరాట్ కోహ్లీకి జరిమానా

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) బ్యాటర్ విరాట్ కోహ్లి జరిమానాకు గురయ్యాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్ సందర్భంగా ఐపిఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో బిసిసిఐ అతని మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత వేసింది. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటనలో కోహ్లి ఐపిఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2 లెవల్ వన్ నేరం కింద మ్యాచ్ ఫీజులో కోత విధించాం అని వెల్లడించింది. విరాట్ కోహ్లి చెన్నై బ్యాటర్ శివం దూబే ఔటైన తర్వాత బ్యాటర్‌ను రెచ్చగొట్టే ధోరణిలో సెలబ్రేట్ చేసుకున్నాడు.

ఐపిఎల్‌లో నేడు..
రాజస్తాన్ × లక్నో
(వేదిక: జైపూర్; రా.7.30గం॥లకు)

స్వలింగ వివాహాలపై కొనసాగనున్న వాదనలు



న్యూఢిల్లీ : స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధతను ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం సుప్రీంకోర్టులో వాదనలు ప్రారంభమయ్యాయి. బుధ, గురువారాల్లో కూడా ఈ వాదనలు కొనసాగనున్నాయి. కేంద్రప్రభుత్వం వచ్చే వారం తన వాదనలు వినిపించనుంది. విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది ముకుల్ రోహతగి మాట్లాడుతూ, ఒక కమ్యూనిటీ ప్రాథమిక హక్కులను తిరస్కరించడానికి ప్రజామోదాన్ని పరీక్షించడం సరిపోదని వ్యాఖ్యానించారు. "అసలు ఇక్కడ జరుగుతున్న కళంకం ఏమిటి? రాజ్యాంగ ప్రకటన ద్వారా మాత్రమే దాన్ని తొలగించ గలుగుతాం" అని అన్నారు. "లైంగిక దృక్పథం ప్రాతిపదికగా వివక్ష చూపడమనేది ఒక వ్యక్తి పరువు, ప్రతిష్టను దారుణంగా దెబ్బతీస్తుంది" అని వ్యాఖ్యానించారు. అంతకుముందు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ మాట్లాడుతూ, ప్రత్యేక వివాహాల చట్టం కింద వివాహం చేసుకోవాలనుకుంటున్న జంట తప్పనిసరిగా 30 రోజుల నోటీసు ఇవ్వాలనడం కూడా రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించారు. "సాధారణ వివాహంలో కూడా ఆ వివాహానికి అభ్యంతరం వున్న వారు వెంటనే వాటిని తెలియచేయాలంటూ నోటీసులివ్వాలనడం కూడా రాజ్యాంగ విరుద్ధం." అని ఆయన వ్యాఖ్యానించారు. అంతకుముందు ఈ పిటిషన్ల విచారణకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని సుప్రీం ప్రకటించింది. అందుకు అనుగుణంగా జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ ఎస్‌కె కౌల్, జస్టిస్ రవీంద్ర భట్, జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ పిఎస్ నరసింహాతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణను ప్రారంభించింది. బయోలాజికల్ పురుషుడు లేదా బయోలాజికల్ మహిళ అన్న భావన సంపూర్ణం కాదు, మీ జననాంగాలు ఏమిటనేది మాత్రమే ఇక్కడ ప్రశ్న కాదు" అని విచారణ సందర్భంగా విడిగా చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఏ సంబంధమైనా సామాజికంగా ఆమోదం పొందడమనేది కేవలం న్యాయ స్థానాలపైనో లేదా చట్టసభలపైనో ఎన్నడూ ఆధారపడి వుండదని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ చంద్రచూడ్ పై వ్యాఖ్యలు చేశారు.

లూలాపై అక్కసు వెళ్లగక్కిన అమెరికా

వాషింగ్టన్ : ఉక్రెయిన్ విషయంలో బ్రెజిల్ అధ్యక్షులు లూలా డసిల్వా వైఖరిపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉక్రెయిన్‌లో పోరాటాన్ని అంతమొందించడంలో పశ్చిమ దేశాలకు ఆసక్తి లేదని లూలా ఘాటుగా విమర్శించిన సంగతి తెలిసిందే. అయితే ఈ వ్యాఖ్యలు అమెరికాకు మింగుడుపడటం లేదు. దీంతో ప్రతిదాడికి పూనుకుంది. 'రష్యా, చైనా ప్రచారాన్నే చిలుక పలుకుల్లా డసిల్వా వల్లించార'ంటూ అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బే అక్కసు వెళ్లగక్కారు. గత వారంలో చైనాలో పర్యటన సందర్భంగా లూలా మాట్లాడుతూ, "యుద్ధాన్ని ప్రోత్సహించడాన్ని అమెరికా ఆపాల్సిన అవసరముంది. అలాగే శాంతి గురించి మాట్లాడాల్సి వుంది. యురోపియన్ యూనియన్ కూడా శాంతి గురించి మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా వుంది." అంటూ లూలా పేర్కొన్నారు. మాస్కో, కీవ్‌ల మధ్య చర్చల సందర్భంగా క్రిమియా హోదా కూడా చర్చకు రావాలని లూలా సూచించారు. అవసరమనుకుంటే శాంతియుత పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించే గ్రూపులో తాను కూడా భాగస్వామ్యం అవుతానని లూలా ప్రతిపాదించారు. లూలా వ్యాఖ్యలపై స్పందించాలని కోరగా, కిర్బే స్పందిస్తూ, వాస్తవాలను పరిశీలించకుండా లూలా మాట్లాడారని చెప్పుకొచ్చారు. యుద్ధం ఆగాలని తాము కూడా కోరుకుంటున్నామన్నారు. పుతిన్ దాడులు ఆపి, బలగాలను ఉపసంహరిస్తే ఈ క్షణమైనా అది జరగవచ్చునని కిర్బ తెలిపారు.



ఎన్‌టిఆర్-30లో సైఫ్

ఎన్‌టిఆర్, కొరటాల కాంబోలో వస్తోన్న ఎన్‌టిఆర్-30 చిత్ర షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలోనే జరుగుతోంది. సినిమాలోని కీలక ఫైట్ సన్నివేశాలను ఇక్కడ తెరకెక్కిస్తున్నారు. విలన్‌గా నటిస్తున్న బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ చిత్రీకరణకు హాజరైనట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. కీలక పోరాట సన్నివేశాల చిత్రీకరణ సోమవారం రామోజీ ఫిల్మ్ సిటీలో మొదలైంది.

గుండెపోటుతో అల్లు రమేష్ మరణం



రంగస్థల నటుడు, కమెడియన్ అల్లు రమేశ్ గుండెపోటుతో మంగళవారం విశాఖపట్నంలో మరణించారు. అల్లు రమేశ్ మృతి చెందిన విషయాన్ని డైరెక్టర్ ఆనంద్ రవి సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. విశాఖపట్టణానికి చెందిన అల్లు రమేష్ తొలుత నాటకాల్లో నటించేవారు. ఆ తర్వాత ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి పలు తెలుగు సినిమాల్లో కమెడియన్ పాత్ర పోషించారు. చిన్న చిన్న పాత్రలు చేసినా తనదైన ప్రత్యేక నటన, యాసతో గుర్తింపు తెచ్చుకున్నారు. అల్లు రమేష్ ఆకస్మిక మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రపంచ రికార్డును సమం చేసిన జ్యోతి సురేఖ

ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1



అంటాల్య(టర్కీ): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1లో వెన్నం జ్యోతి సురేఖ అద్భుత ప్రదర్శనతో ప్రపంచ రికార్డును సమం చేసింది. మంగళవారం జరిగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ర్యాంకింగ్స్‌లో జ్యోతి సురేఖ 713పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. తొలి అర్థభాగానికి 36విల్లంబులు సంధించి 353పాయింట్లు సాధించిన జ్యోతి సురేఖ.. ఆ తర్వాత 360పాయింట్లను సాధించింది. మొత్తం మొత్తం 66షాట్స్‌లో 10 పర్‌ఫెక్ట్ షాట్స్ సంధించింది. దీంతో 2015లో కొలంబియాకు చెందిన సారా లోపెజ్ నెలకొల్పిన ప్రపంచ రికార్డును సమం చేసింది. అలాగే 2017లో కొరియాకు చెందిన చేవాన్ సో(709పాయింట్లు) పేర ఉన్న ఆసియా రికార్డును బ్రేక్ చేసింది.

జాతీయ షూటింగ్ ట్రయల్
టాప్‌లో సరబ్‌జోత్, అనురాధ



భోపాల్: 4వ జాతీయ షూటింగ్ సెలెక్షన్ ట్రయల్స్ ఎయిర్ పిస్టల్ విభాగంలో సరబ్‌జోత్ సింగ్, అనురాధ అగ్రస్థానంలో నిలిచారు. భోపాల్‌లోని మధ్యప్రదేశ్ అకాడమీలో జరుగుతున్న జాతీయ షూటింగ్ పోటీల్లో సరజ్‌జ్యోత్(586) 16-12పాయింట్ల తేడాతో అర్జున్ సింగ్ ఛీమాపై విజయం సాధించాడు. రెండుసార్లు ప్రపంచకప్ స్వర్ణ పతక విజేత, ఆసియా క్రీడల ఛాంపియన్ సౌరభ్ చౌదరి 582పాయింట్లతో 8వ స్థానానికే పరిమితమయ్యాడు. అలాగే మహిళల ఎయిర్ పిస్టల్‌లో అనురాధ దేవి 17-11పాయింట్ల తేడాతో పలక్ ఘులియాపై గెలిచి కెరీర్‌లో తొలిసారి షూటింగ్ పోటీల్లో అగ్రస్థానంలో నిలిచింది. ఇక మనుభకర్ 0.3పాయింట్ల వ్యత్యాసంతో మూడోస్థానానికే పరిమితమైంది. ఇక ఒలింపియన్ నేహా(13), యశస్విని సింగ్ దేశ్వాల్(15) స్థానాల్లో నిలిచారు. వీరి ఖాతాలో 571పాయింట్లు మాత్రమే ఉన్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68